
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం 14 నవంబరు 2025




ఇటీవల తుఫాన్‌కు కల్లూరులో నేలవాలిన వరి పంట (ఫైల్)

తేలిన నష్టం లెక్క

- జిల్లాలో 1,579 హెక్టార్లలో పంటలు నష్టం
- పంచాయతీల్లో అర్హులైన రైతుల జాబితా
- 17న తుది నివేదిక

ఖమ్మం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న పంటల లెక్కలను వ్యవసాయ శాఖ తేల్చింది. క్షేత్ర స్థాయిలో అధికారులు సర్వే పూర్తిచేయగా.. పంట నష్టంజరిగినా జాబితాలో తమ పేర్లు లేవని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అర్హుల జాబితాలను గ్రామపంచాయతీల్లో ప్రదర్శించనున్నారు. ఇక 17వతేదీన తుది నివేదికను వ్యవసాయశాఖ సిద్ధం చేయబోతోంది. ఇప్పటి వరకు సేకరించిన లెక్కలప్రకారం జిల్లాలో 3,901 రైతులకు సంబంధించి 1,579హెక్టార్లలో పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలు నష్టం జరిగినట్టు వ్యవసాయశాఖ అంచనా వేసింది. తద్వారా రూ.3.90కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరం ఉంటుందని, ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఎకరానికి రూ.10వేల వంతున పంట నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో అతి భారీగా వర్షాలు పడినందున పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటలు భారీగా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల మిర్చి కూరగాయలు పంటలకు నష్టం జరిగింది. పత్తి పంట తీస్తున్న తరుణంలో భారీవర్షాలు రావడంతో చేలోని పంట కారిపోవడం, నల్లబడడంతో నాణ్యత దెబ్బతిన్నది. మొక్కజొన్నలు కూడా వర్షానికి పూర్తిస్థాయిలో విత్తుకోలేదు. అయితే ఆవెంటనే ఎండలు రావడంతో చాలావరకు పంటలు కోలుకున్నాయి. వ్యవసాయశాఖ నిబంధనల ప్రకారం 33శాతం కంటే అధికంగా పంట నష్టం జరిగితేనే గుర్తించడం జరుగుతుంది. జిల్లాలో మండల వ్యవసాయాధికారుల నివేదికల ఆధారంగా పంటనష్టంపై ప్రాథమికంగా 3,901మంది రైతులకు సంబంధించి 1,579 హెక్టార్లలో పంటనష్టం జరిగినట్టు తేల్చారు. అయితే గ్రామపంచాయతీల్లో జాబితాల వెల్లడి అనంతరం రైతులనుంచి అభ్యంతరాలు వస్తే సర్వేచేసి అర్హులైన వారిని జాబితాలో చేరుస్తామని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే పంటల నష్టం అర్హుల జాబితాలను గ్రామ పంచాయతీలకు పంపామన్నారు.



గత శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

సర్వే చేశారు.. హద్దులు పాతారు..

కబ్జాకు గురైన జమలాపురం ఆలయ భూముల స్వాధీనం
6


(ఫైల్ ఫొటో)

ఇప్పుడైనా.. బ్రేక్ పడేనా?

ఆంధ్రప్రదేశ్‌లో ఉచితంగా ఇస్తున్న ఇసుకను తెలంగాణకు పెద్ద ఎత్తున లారీలలో తరలించి.. కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న వైనంపై అక్కడి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఏపీలోని దాదాపు 48 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇసుక, మట్టి దందాతో పాటు వివిధ రకాల దందాలు, నిర్లిప్తత, ప్రజల విజ్ఞప్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే నివేదిక ప్రభుత్వానికి చేరడంతో.. ఆయా ఎమ్మెల్యేలకు తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తీరు మార్చుకోకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో సరిహద్దులోని ఎమ్మెల్యేలు దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు.

ఆంధ్రా నుంచి తెలంగాణలోకి యథేచ్ఛగా సాగుతున్న ఇసుక రవాణా

- ఏపీ సీఎం హెచ్చరికతో అక్కడి అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తం
- అయినా సరిహద్దు ప్రాంతంలోకి వస్తున్న ఇసుక వాహనాలు
- ఇటీవలే పెనుబల్లి, దమ్మపేట, అశ్వారావుపేటలో పట్టుబడ్డ లారీలు
- చెక్‌పోస్టుల ఎత్తివేతతో మరింత స్వేచ్ఛగా అక్రమార్కుల దందా

అశ్వారావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దులోని పోలవరం ఎమ్మెల్యే గత సోమవారం విలేకరుల సమావేశం పెట్టి మరీ ఇసుక దందాపై తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. ఏపీ ఇసుక తెలంగాణకు తరలిపోవడంతో.. ఆ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని అన్నారు. చాలా మంది తన పేరు చెప్పుకొని ఇసుకను తరలిస్తున్నారన్నప్రచారంజరుగుతుందని.. అలాంటి వారు ఎంతటి వారైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ హెచ్చరికతోనైనా ఇసుక దందా ఆగుతుందా? లేకుంటే యధావిధిగా తంతు కొనసాగుతుందా!? అన్న విషయం మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

హెచ్చరించిన రోజునే ఇసుక టిప్పర్ పట్టివేత

ఇసుక దందాను సహించం.. అంటూ పోలవరం ఎమ్మెల్యే ప్రకటన చేసిన రోజే అశ్వారావుపేటలో కొవ్వూరు నుంచి వచ్చిన ఇసుక లారీ పోలీసులకు పట్టుబడడం విశేషం. గత వారం రోజుల్లో జిల్లాలోని పెనుబల్లి, దమ్మపేటల్లోనూ ఇసుక లారీలు పట్టుబడ్డాయి. ఇలా ఏపీ టు తెలంగాణ.. ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతుందనడానికి ఇవి కొన్ని మచ్చు తునకలు మాత్రమే. పత్రికలలో ఇసుక దందాపై కథనాలు ప్రచురితమైనప్పుడు.. టాస్క్‌ఫోర్స్, పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టిన సమయంలో ఒకటి రెండురోజులు రవాణాను వాయిదా వేయడం తప్పా.. పూర్తిగా బ్రేక్ పడే పరిస్థితులు లేవు. హైదరాబాద్‌కు చెందిన సుమారు 70 లారీలు ప్రతీరోజు ఏపీలోని కొవ్వూరు ప్రాంతం నుంచి తెలంగాణలోని అశ్వారావుపేట, మేడిశెట్టి వారిపాలెం, సత్తుపల్లి, పెనుబల్లి ప్రాంతాల మీదుగా తెలంగాణాలోకి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూనే ఉంటాయి. ఏపీలో ఉచితంగా లభ్యమవుతున్న ఇసుకను హైదరాబాద్‌కు తరలించి ఒక్కో లారీ ఇసుకను రూ.1.50 లక్షలకు అమ్ముతున్నారనేది బహిరంగ రహస్యం. నెల రోజుల క్రితం ఇసుక దందాపై ఁఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనాలు వెలువడ్డాయి. అప్పట్లో తాత్కాలికంగా తగ్గినట్టు కనపడినా.. ఇటీవల కాలంలో ఇసుక అక్రమ రవాణా మళ్లీ వేగం పుంజుకుంది.

చెక్‌పోస్టుల ఎత్తివేతతో అడ్డూ అదుపూ లేకుండా..

గతంలో సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఉండడం వల్లో.. ట్రాఫిక్ వల్లో.. లేకుంటే లారీలను తూకం వేసేందుకు

(మిగతా 6వ పేజీలో)

దందాలో ఇరురాష్ట్రాల్లోని బడాబాబుల ప్రమేయం..

ఇసుక దందాలో ఏపీ, తెలంగాణకు చెందిన కొందరు బడాబాబుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో పత్రికలలో వచ్చిన ఒకటి రెండురోజుల పాటు వెనక్కు తగ్గినట్టు కనిపించినా.. తిరిగి ఇసుక దందా యధావిధిగా కొనసాగుతూనే ఉంది. సామాన్యులు ఓ ఇసుక ట్రాక్టర్‌ను తీసుకెళితే వెంటాడి పట్టుకునే అధికారులు.. ఇంత పెద్ద ఎత్తున బహిరంగంగానే తరలిపోతున్న ఇసుక లారీలను అరికట్టడంలో ఎందుకు విఫలమవుతున్నారనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇసుక దందాను ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో ఇప్పటికైనా ఏపీ నుండి ఇసుక తెలంగాణలోకి ప్రవేశించడంపై బ్రేక్‌లు పడతాయో!? లేదా!? అన్నది వేచి చూడాల్సిందే.. అదే సమయంలో రాష్ట్రంలోని ఇసుక ర్యాంపులన్నింటినీ ఓపెన్ చేసి ఇసుక అనుమతులు సులభతరం చేసినప్పుడు అక్రమ రవాణా తగ్గే అవకాశాలున్నాయి. ఈ దిశగా ఇక్కడి ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క

ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలకే అంకితం చేస్తాం

- వారికి జవాబుదారులుగా ఉంటాం
- దేశానికే తలమానికంగా ఇందిరా మహిళా డెయిరీ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ముదిగొండ మండలం గంధసిరిలో పర్యటన

ముదిగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వాన్ని ప్రజలకే అంకితం చేసి జవాబుదారులుగా ఉంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో పర్యటించిన ఆయన రూ.2కోట్ల వ్యయంతో పునర్నిర్మాణంచేయనున్న శ్రీసుందర మౌళేశ్వరస్వామి ఆలయ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ గంధసిరి గ్రామానికి పురాతన చరిత్ర ఉందని, నాడు గాంధారిపట్టణమే నేడు గంధసిరి అయిందన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాల్లో ఈ ఆలయాన్ని నిర్మిస్తానని మాట ఇచ్చానని ఆమేరకు నేడు ఈ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయటం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పామని, నియోజకవర్గానికి 3,500ఇళ్లు మంజూరు చేశామని, ప్రతీ రూపాయి పోగేసి ప్రజల కోసమే ఖర్చుచేస్తున్నామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వలేకపోయిందని ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్రంలో 96లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని, గత పదేళ్లలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక తల్లిదండ్రులు మదనపడ్డారని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 70వేల ఉద్యోగులు ఇచ్చి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందాన్ని చూశామన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసమే ప్రతీ నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు 40శాతం డైట్ చార్జీలు, 200శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచామని ఆయన తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వలేకపోయిందని ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడగానే మహిళా ఆర్థికాభివృద్ధి కోసం వడ్డీలేని రుణాలు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని ఆనాడు బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారని, నాడునేడు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. ఎంత డిమాండ్ పెరిగినా పేదలతోపాటు రైతులకు 200యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. మధిర నియోజకవర్గంలో 60వేలమంది మహిళా సభ్యులున్న ఇందిరా మహిళా డెయిరీ దేశానికి తలమానికంగా ఉండబోతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మించుకుంటే త్వరితగతిన డబ్బులను జమ చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మించిన ఒక ఇందిరమ్మ (మిగతా 6వ పేజీలో)

22 నెలల పాలనలో.. పేదలు తలెత్తుకునేలా చేశాం..

- వారి సంక్షేమం ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం
- 15 రోజుల్లో జలాశయాల్లో రొయ్యపిల్లల విడుదల
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాలేరు జలాశయంలో చేపపిల్లలు పోసిన మంత్రి


కూసుమంచి క్యాంపుకార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి

కూసుమంచి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ 22నెలల పాలనలో పేదలు తలెత్తుకునేలా చేశామని, ఇందిరమ్మ ప్రభుత్వం పేదలపక్షపాతి అని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన కూసుమంచి మండలం పాలేరు జలాశయంలో చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు ఎక్కడా ఇబ్బందికలగకుండా అనేక సంక్షేమకార్యక్రమాలు అమలుచేస్తున్నామని, ఇందులోభాగంగా మత్స్యకారుల అభ్యున్నతికోసం నీటివనరుల్లో ఉచితంగా చేపపిల్లలు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఇక మత్స్యకారుల విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలోని 101జలాశయాల్లో పెద్దసైజుగల రొయ్యపిల్లలను 15రోజుల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్భాటాలకు పోకుండా నిధులను పొదుపుగా ప్రజాసంక్షేమానికి వినియోగిస్తున్నట్లు వివరించారు. అనంతరం కూసుమంచి క్యాంపుకార్యాలయంలో 90మంది లబ్ధిదారులకు రూ.38లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.


పాలేరు జలాశయంలో చేపపిల్లలు వదులుతున్న మంత్రి

విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడొద్దు

విద్యాసంస్థల్లో అనేకమంది పిల్లలు, యువకులు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దని మంత్రి పొంగులేటి తెలిపారు. కూసుమంచి ఉన్నత పాఠశాలలో వ్యక్తిగత నైపుణ్యాభివృద్ధి శిక్షణలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వజ్రం సానపడితేనే విలువ తెలుస్తుందని అదేవిధంగా గురువులను తల్లితండ్రులకు గుర్తింపువచ్చేలా విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యలను సాధించాలని హితవుపలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఎంఈవో వీరాస్వామి, తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీఎస్సార్ ఛారిటముల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసికొద్ది దూరం సైకిల్ తొక్కి వారిలో ఉత్సాహం నింపారు.

నేడు, రేపు జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్ర, శనివారాల్లో ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం 9గంటలకు ఖమ్మం నయాబజార్ కళాశాల వద్ద నెహ్రూ విగ్రహానికి నివాళి అర్పిస్తారు. ఆ తర్వాత ఉదయం 10గంటలకు రఘునాథపాలెం మండలం ఈర్లపూడి, పంగిడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. మధ్యాహ్నం కొణిజర్ల మండలం అంజనాపురంలో గోద్రేజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పరిశీలించనున్నారు. ఇక శనివారం సాయంత్రం ఖమ్మం లకారం చెరువులో చేపల పిల్లల్ని వదిలి.. అనంతరం 49వ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

సర్కారు వైద్యంపై నమ్మకం కలిగించేలా..

- వైద్యసిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతా
- 'ఆంధ్రజ్యోతి'తో డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు
- బాధ్యతలు స్వీకరించిన నూతన జిల్లా వైద్యాధికారి



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ వైద్యం పై ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేస్తానని జిల్లా నూతన వైద్యాధికారి డాక్టర్ దనాలకోట రామారావు అన్నారు. ప్రభుత్వం ఏ లక్ష్యంతో వైద్యరంగానికి పెద్దపీట వేస్తుందో దాన్ని జిల్లాలో మారుమూల గ్రామాలకు కూడా విస్తరింపజేసి జిల్లాను అగ్రపథాన నిలపనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం ఆయన జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

పీహెచ్‌సీలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో 26 పీహెచ్‌సీలు, నాలుగు యూపీహెచ్‌సీలు, తొమ్మిది పట్టణ దవాఖానాలు, 161 పల్లె దవాఖానాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు 82ఉన్నాయి. వీటిల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటలవరకు వైద్యసేవలు అందించేలా అన్ని చర్యలు తీసుకుంటాం. పీహెచ్‌సీల్లోనూ 24గంటల పాటు వైద్యసేవలు కొనసాగేవి ఉన్నాయి. అన్ని చోట్లా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. సీజనల్ వ్యాధులకు సరిపడా కూడా మందులున్నాయి. విషజ్వరాలు, ఏదైనా అనుకోని అత్యవసర సమయాల్లో జీజీహెచ్‌కు రిఫర్ చేయాలని సాధారణ రోగులకు పీహెచ్‌సీ స్థాయిలోనే వైద్యం అందేలా అన్నిచర్యలు తీసుకుంటా.

సమన్వయంతో పనిచేస్తాం..

జిల్లాలో ప్రతి సీజన్‌లో డెంగ్యూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో దోమల వ్యాప్తిని అరికట్టేలా అన్ని శాఖలతో సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేస్తాం. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించేలా ఆదేశాలు ఇస్తా. అన్ని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించిఆయిల్ బాల్స్ వేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించనున్నాం. పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండే విధంగా అన్ని చర్యలు తీసుకుంటాం. వైద్యులు, సిబ్బంది ఇన్‌పేషంట్ల కోసం రాత్రివేళలో కూడా అందుబాటులో ఉండేలా సూచనలు ఇస్తాం. అయితే ఆస్పత్రిల్లో దాదాపు వైద్యుల కొరత ఏమీ లేదు. ఎక్కడైనా ఖాళీలు ఉంటే వాటిని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలతో పూర్తి చేసి గ్రామస్థాయిలో ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేస్తాం.

ప్రసవాలపై ప్రత్యేక దృష్టి

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యమిస్తాం. మెడికల్ ఆఫీసర్లకు పీహెచ్‌సీ స్థాయిలో అన్ని సదుపాయాలు కల్పించాం. అక్కడ కూడా కాన్పులు జరిగేలా చేస్తాం. గర్భిణుల వివరాల నమోదు , వారికి ఆరోగ్య చికిత్సలు, సలహాలు సూచనలు ఇచ్చి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ కాన్పులు జరిగేలా ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రోత్సాహానిస్తాం. మొదటి కాన్పులోనే సీ సెక్షన్ కాకుండా సాధారణ కాన్పులకే ప్రాధాన్యం కల్పించి గర్భిణులకు అవగాహన కల్పిస్తాం. మంత్రులు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా వైద్యాధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బంది సహకారంతో జిల్లాను వైద్యపరంగా అగ్రపథాన నిలిపేందుకు కృషిచేస్తా.

నేడు పాఠశాలల్లో పేరెంట్, టీచర్స్ మీటింగ్

ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖ అధికారులు

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ నెల మూడో శనివారం పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెలకు సంబంధించిన సమావేశాన్ని బాలల దినోత్సవమైన నవంబరు 14 శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని గురువారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రగతి ఎలా ఉంది? ఇంకేమైనా సమస్యలున్నాయా, తల్లితండ్రులు ఆలోచనలు ఎలా ఉన్నాయి? వారి సూచనలు, సలహాలు తీసుకునేందుకు సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి తల్లితండ్రులు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, నూరు శాతం హాజరుపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలోని 814ప్రైమరీ, 191 అప్పర్ ప్రైమరీ, 212 ఉన్నత పాఠశాలలు, మొత్తం 1,217 స్కూళ్లతోపాటు 14 కేజీబీవీలు, రెండు మోడల్ స్కూళ్లలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎంవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల తల్లితండ్రులకు ముందుగానే ఆహ్వాన పత్రాలు అందించామని తెలిపారు.

పోలీసుల డ్రగ్స్ వేట..!

» గంజాయి వేటలో పోలీసు జాగిలాలు
» మాదక ద్రవ్యాలు.. సైబర్ నేరాలపై ఉక్కుపాదం



వ్యాపార సంస్థల్లో జాగిలాలతో తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు

ఇల్లెందు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజా క్షేత్రంపై దృష్టించి సారించారు. ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలమేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు అరికట్టడానికి దృష్టి సారించింది. గంజాయి సేవించే, రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. మత్తుకు అలవాటు పడిన యువకులను గుర్తించి అదుపులోకి తీసుకుంటూ కౌన్సిలింగ్‌లు నిర్వహిస్తూ వారి తల్లిదండ్రులకు పిల్లల సంరక్షణ ప్రవర్తనపై దృష్టి సారించాలని అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు. గడిచిన 3 నెలల కాలంలో ఇల్లెందు డివిజన్‌లో పోలీసులు నిత్యం అసాంఘిక చర్యలపై గంజాయి మాదక ద్రవ్యాలపై విద్యార్థులు, యువకులను చైతన్య పరిచేందుకు వివిధ సెంటర్లలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, కాలేజీల్లో సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థులను సైతం చైతన్య పరుస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు..

కొనసాగుతున్న కార్డన్‌సెర్చ్‌ల పరంపర..

ప్రజలను చైతన్యం పేరిట అవగాహన కార్యక్రమాలతోపాటుగా సైబర్ నేరాలపై సదస్సులు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్న పోలీసులు.. తెల్లవారు జామున అనూహ్యంగా బస్తీలు, కాలనీల్లో కార్డెన్ సెర్చ్‌లు జరుపుతున్నారు. అనుమానితులను గుర్తించడం, నెంబర్‌ప్లేట్లు, రిజిస్ట్రేషన్లు లేని వాహనాలను చోరీలకు గురై అక్రమంగా వినియోగిస్తున్న వాహనాలను కార్డెన్ సెర్చ్‌లో గాలింపులు, తనిఖీలు జరుపుతూ అదుపులోకి తీసుకుంటున్నారు. అలా దాదాపు 200పైగా వాహనాలను ఇల్లెందులో పోలీసులు గుర్తించి రిజిస్ట్రేషన్లు చేయించారు. గంజాయి సేవిస్తున్న 19 మందిని పోలీసులు అరెస్టు చేసి కౌన్సిలింగ్‌లు ఇవ్వడం గంజాయి రవాణా చేస్తున్న 12 మందిని అరెస్టు చేయడం ద్వారా అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక గాలింపు చర్యలు జరపడం ద్వారా గంజాయి రవాణాదారులను, సేవించే వారిని హడలెత్తిస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం గ్రామానికి చెందిన సపావత్ వెంకన్న అనే గంజాయి వ్యాపారి చత్తీస్‌ఘడ్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్న విషయాన్ని గుర్తించిన ఇల్లెందు పోలీసులు అతడిపై పీడీ యాక్టు కింద అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను, సీఐ తాటి పాముల సురేష్‌ల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపుతున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్ జాగిలం జస్సీని రంగంలోకి దించి మాదక ద్రవ్యాలను గుర్తించే చర్యలు చేపట్టడం గమనార్హం. స్వయంగా పోలీసు అధికారులు పట్టణంలోని వర్తక వ్యాపార సంస్థల్లో పాన్‌షాపుల్లో, పార్శిల్ రవాణా కార్యాలయాల్లో గంజాయి మత్తు కలిగించే చాక్లెట్లు, సిగరేట్ల కోసం నిరంతరం తనిఖీలు చేస్తుండటంతో వ్యాపారులు సైతం హడలిపోతున్నారు.

బహిరంగ మద్యపానంపైనా..

ఇల్లెందులో పోలీసులు బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేస్తూ హడలెత్తిస్తున్నారు. బహిరంగ మద్యపానం చేసేవారిని అదుపులోకి తీసుకుంటూ వారికి కౌన్సిలింగ్‌లు ఇప్పిస్తున్నారు. గత మూడు నెలల కాలంలో దాదాపు 200 మందికి పైగా మద్యం సేవించిన వారిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. చోరీల నివారణకు బ్లూకోట్స్‌తో పాటు 4 పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి అనుమానిత ప్రాంతాల్లో రాత్రి వేళల్లో నిరంతరం గస్తీలు నిర్వహిస్తుండటం పోలీసు పాయింట్లు పెట్టి రాత్రి వేళల్లో హాజరుకావడం లాంటి చర్యలతో చోరీల బెడద దాదాపు కనుమరుగైంది. అంతేకాక పోలీసు బృందం చేత పట్టణంలోని కాలనీల్లో చైతన్యం కలిగించే కళారూపాలు, నాటికల ప్రదర్శనలు ఇప్పిస్తూ ప్రజా చైతన్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి గంజాయిని నిర్మూలించేందుకు 'డాగ్‌స్క్వాడ్‌'ను రంగంలోకి దింపి సేవించేవారిని, రవాణా చేసేవారిని గుర్తిస్తుండటంతో హడలిపోతున్నారు. పోలీసుల వినూత్న చర్యలు ప్రజాబాహుల్యంలో విశేష మన్ననలు పొందుతున్నాయి.



కళారూపాల ద్వారా పోలీసుల చైతన్య కార్యక్రమాలు

తహసీల్దార్లకు మంత్రి పొంగులేటి మందలింపు



నారాయణపురంలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి పొంగులేటి

కల్లూరు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం పట్ల రెవెన్యూశాఖ అధికారులు వహిస్తున్న నిర్లక్ష్యం పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత తహసీల్దార్లను మందలించారు. మంత్రి స్వగ్రామమైన నారాయణపురంలోని గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బాధితులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు భూ సమస్యలపై వినతుల రూపంలో మంత్రికి దరఖాస్తులు అందజేశారు. బాధితులు విన్నవించిన భూ సమస్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి నేరుగా కల్లూరు, సత్తుపల్లి మండలాల తహసీల్దార్లను నేరుగా పిలిచి మందలించారు. ఇక పై భూ సమస్యలను సత్వరమే పరిష్కారించాలని వారిని ఆదేశించారు. కల్లూరు డివిజన్ పరిధిలోని పలు మండలాల నుంచి ఎక్కువ శాతం భూ సమస్యలపైనే పలువురు బాధితులు మంత్రి కి ఫిర్యాదులు చేశారని తెలిసింది. దీంతో మంత్రి పొంగులేటి కల్లూరు డివిజన్ పరిధిలో గల తహసీల్దార్లతో భూ సమస్యల పరిష్కారంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నారాయణపురంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, దరవత్ మోహన్‌నాయక్, తక్కెళ్లపాటి ప్రసాద్ యాసా శ్రీకాంత్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కావాలి

» క్వాలిటీ జనరల్ మేనేజర్ వెంకటరమణ

కొత్తగూడెం టౌన్,నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలనేదే అందరి లక్ష్యం కావాలని జనరల్ మేనేజర్ (క్వాలిటీ) జె. వెంకటరమణ అన్నారు. గురువారం సింగరేణిలో బొగ్గు నాణ్యత వారోత్సవాలను నిర్వహించారు. క్వాలిటీ కార్యాలయంలో కార్మికులచే నాణ్యతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు లోగనాథన్, దుర్గ ప్రసాద్, మంగీలాల్, ఈశ్వరయ్య, రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

చర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా నేషనల్‌పార్కు అడవుల్లో రెండు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతిచెందిన ఆ ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను బుధవారం బీజాపూర్ జిల్లా పోలీస్ లైన్‌కు తరలించి గుర్తించారు. వారిలో మద్దేడు ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ బుచ్చన్న రూ.8లక్షల రివార్డు, పామేడు ఏరియా కమిటీ కార్యదర్శి ఊర్మిళపై రూ.8 లక్షల రివార్డు, మద్దేడు ఏరియా కమిటీ సభ్యులు మోటుపై రూ.5లక్షల రివార్డు, భరత్‌పై రూ.2లక్షల రివార్డు, పామేడు ఏరియా కమిటీ సభ్యులు దేవ రూ.2లక్షల రివార్డు, మంగళిపై రూ.2లక్షలు రివార్డు ఉంది. ఊర్మిళ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడు పాపారావు భార్య. పాపారావు టీంకు చెందిన 60 మంది మావోయిస్టులు నేషనల్ పార్కులో ఉన్నారనే సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. పాపారావు, ఇతర మావోయిస్టులు తప్పించుకున్నారని తెలిపారు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఆరు తుపాకులు, రేడియో, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు.



మావోస్టుల మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

నేడు బాలల దినోత్సవం

» పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు



ఖమ్మంఖానాపురంహవేలీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మన దేశ మొదటి ప్రధాని చాచా నెహ్రూ పుట్టిన రోజైన నవంబరు 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటాం. బాలల దినోత్సవం సందర్భంగా ప్రధానంగా విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. పిల్లలే ఉపాధ్యాయులుగా స్వయంపరిపాలన దినోత్సవం, బాలల అసెంబ్లీ, మాక్ పార్లమెంట్‌లు నిర్వహిస్తారు. పిల్లలకు వివిధ సంస్థల ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తారు. నేటి బాలలే రేపటి పౌరులు. రేపటి తరాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. తెలిసో తెలియకో వారు పొరపాట్లు చేస్తే సరిదిద్దాల్సిన అవసరం ఉంది. తమ బాల్యాన్ని ఆనందంగా గడిపేలా వారిలో ఉత్సాహాన్ని నింపాలి. విద్యావంతులుగా ఎదగనివ్వాలి. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. సరిగ్గా ఇవే ఆలోచనలు స్వతంత్ర భారతదేశ మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఉండేది. ఆయన్నే మనం ముద్దుగా చాచా నెహ్రూ అని పిలుచుకుంటాం. ఆయనకు పిల్లలంటే ఎంతో ఇష్టం. చిన్నారులు కనిపిస్తే వారిని దగ్గరకు పిలిచి గులాబీ ఇచ్చే వారు. చిరునవ్వులు చిందించేవారు. ఆయన 1889 నవంబర్ 14న జన్మించారు. సుసంపన్నమైన కుటుంబంలో పుట్టినప్పటికీ ప్రజల మీద ప్రేమ పెంచుకున్నారు. భావితరాల బాగోగులపై దృష్టి సారించారు. జీవితాంతం దేశ సేవలోనే ఉన్నారు. ఆయన పుట్టినరోజున ఏటా మనం బాలల దినోత్సవం జరుపుకొంటున్నాం.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పాఠశాలల యాజమాన్యాలు బాలల దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేశాయి. బాలల దినోత్సవ వేడుకల్లోనూ సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. బాలల మెదడుకు పదును పెట్టేందుకు నూతన ఆవిష్కరణలను కనిపెట్టేందుకు ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న సైన్స్‌ఫెయిర్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయి. విద్యార్థులు కొత్త కొత్త ప్రాజెక్టులు తయారు చేసి అబ్బురపరుస్తున్నారు. చిన్న వయసులోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని బాల శాస్త్రవేత్తలవతున్నారు.

ప్రస్తుత సమాజంలో విద్యావ్యవస్థ జైలు జీవితంలా మారింది. వివిధరకాల పాఠ్యపుస్తకాల సిలబస్‌ను పిల్లలపై రుద్దేలా వ్యవస్థ ఉంది. ఇలాంటి సందర్భంగా పసి మనసులకు కాస్త ఆహ్లాదాన్ని అందించాలి. తోటి పిల్లలతో కాసేపు ఆడుకోవడానికి అవకాశం ఇవ్వాలి. ఒత్తిడికి గురవుతుంటే గమనించి వారికి ఊరటనివ్వాలి. ఇప్పటి పిల్లలు కంప్యూటర్, ట్యాబ్‌ల్లో వీడియో గేమ్స్ ఆడుతున్నారనేది వాస్తవమే. కానీ ఇరుగు పొరుగు పిల్లలతో ఆడుకోవడమూ ముఖ్యమే. ఆ ప్రాయంలోనే వారిలో స్నేహం అనే భావన చిగురిస్తుంది. మంచి స్నేహితులను ఎంచుకునే అవకాశం ఉంటుంది.

బాలల హక్కులు ఇవే .. !

6-14 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు, ఏదైనా ప్రమాదకరమైన ఉపాధి నుంచి రక్షించబడే హక్కు, బాల్య సంరక్షణ విద్య హక్కు ,వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందే హక్కు, వయస్సు తో సంబంధంలేని సరిపోని వృత్తులలోకి ప్రవేశించే ఆర్థిక అవసరం నుండి రక్షించబడే హక్కు, ఆరోగ్యకరమైన రీతిలో అభివృద్ధి చెందడానికి సమాన అవకాశాలు మరియు సౌకర్యాల హక్కు, స్వేచ్ఛ, గౌరవం హక్కు, దోపిడీకి వ్యతిరేకంగా బాల్యం, యువత రక్షణ హామీ హక్కులను అందించాల్సి ఉంటుంది.



పోలీసులకు పట్టుబడిన ఇసుక లారీ (ఫైల్)

ఇప్పుడైనా.. బ్రేక్ పడేనా?

(5వ పేజీ తరువాయి)

కొద్దిసేపు చెక్‌పోస్టుల వద్ద కొద్దిసేపు ఆగేవి. ఈ సమయంలో కొన్ని లారీలు స్థానికుల కంట పడి పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఇప్పుడు చెక్‌పోస్టులను పూర్తిగా ఎత్తివేయడంతో.. ఇసుక లారీలకు బ్రేక్‌లు లేకుండా పోయాయి. హైవేపై జుయ్‌జుయ్ మంటూ ఇసుక లారీలు తరలిపోతున్నాయి. ఏపీ నుంచి తెలంగాణలోకి అక్రమంగా తరలిపోతున్న ఇసుక దందాను నియంత్రించడంలో అటు ఏపీ అధికారులు, ఇటు తెలంగాణ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక రవాణాను అనుమతుల్లేకుండా చేయడమే కాకుండా, లారీలలో అనుమతులకు మించి బరువును వేసుకొని ఈ లారీలు ప్రయాణిస్తుంటాయి. ఇసుక రవాణాదారులు ప్రత్యేకమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకొని, పైలెట్‌ల వ్యవస్థ ద్వారా ఇసుక అక్రమ రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తూనే ఉన్నారు. చెక్‌పోస్టులను ఎత్తివేసిన వెంటనే రవాణా శాఖాధికారులు అధిక బరువులు కలిగిన వాహనాలు, ఇతరత్రా డాక్యుమెంట్‌లు లేని వాహనాలను తనిఖీ చేపడతారని ప్రజలు భావించినా.. ఇప్పటివరకు ఆ వైపుగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా ఉన్న ఇసుక ర్యాంపులకు అనుమతులు ఇవ్వడం ద్వార ఏపీ నుంచి ఇసుక రవాణాకు చెక్ పెడతారేమోనని స్థానికులు భావించినప్పటికీ.. ఆ వైపుగా చర్యలేవీ కనిపించడం లేదు. ఇసుక ర్యాంపుల గుర్తింపులో సవాలక్ష నిబంధనలను సాకుగా చూపుతూ.. అధికారులు అనుమతులకు నిరాకరిస్తున్నారు. దీంతో స్థానిక అవసరాల కోసం అయా వాగులు, వంకల్లో నుంచి స్థానికంగా ఉన్న ట్రాక్టర్ల యజమానులు అక్రమంగా ఇసుకను తరలించుకోవాల్సి వస్తోంది. ఈ విధానం కొందరు అధికారులకు సిరులు కురిపిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రజాప్రభుత్వాన్ని ప్రజలకే అంకితం చేస్తాం

(5వ పేజీ తరువాయి)



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఇంటిని భట్టి విక్రమార్క పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య, డీఈవో చైత న్య జైనీ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రాయల నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ధనసిరి పుల్లయ్య, డీపీవో ఆశాలత, తహసీల్దార్ సునీత ఎలిజిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో వాల్మీకి కిషోర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు. సొసైటీల చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటయ్య, నాయకులు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, మట్టా రవీందర్‌రెడ్డి, మల్లెల అజయ్, ఉసికల రమేష్, భిక్షం, అన్వేష్, కృష్ణ నర్సింహారావు, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వే చేశారు.. హద్దులు పాతారు..



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కబ్జాకు గురైన జమలాపురం ఆలయ భూముల స్వాధీనం

ఎర్రుపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవారి భూములను కబ్జాకోరల నుంచి కాపాడేందుకు అధికారులు నడుం బిగించారు. 'దేవుడి భూముల్లో దేవాంతకులు' శీర్షికన ఈనెల 7న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. ఎర్రుపాలెం మండలంలోని నర్సింహాపురం గ్రామంలో అన్యాక్రాంతమైన జమలాపురం శ్రీవారి ఆలయ భూములను ఎట్టకేలకు దేవాదాయశాఖ గురువారం సర్వే నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో దేవాదాయశాఖ వరంగల్ డివిజన్ సర్వేయర్ పి.అనిల్‌కుమార్ మామునూరు రెవెన్యూ పరిధిలో సర్వేనెంబరు 421భూమిని సరిహద్దు నెంబర్లతో సహా గుర్తించి రెండెకరాల శ్రీవారికి చెందిన భూమి కబ్జాకు గురైనట్లు నిర్ధారించారు. సుమారు 10.23 ఎకరాల భూమికి హద్దురాళ్లను పాతి అన్యాక్రాంతమైన దేవుడి భూమిని దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకవచ్చారు. భవిష్యత్‌లోనూ ఈ భూములు కబ్జాకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు ఆలయ భూములపై డేగ కన్ను వేసి ఉండాలని కోరారు. అన్యాక్రాంతమైన శ్రీవారి భూముల కబ్జాను వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి గ్రామస్థులు, శ్రీవారి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

కొత్తూరు జగన్మోహన్‌రావు, ఈవో

నర్సింహాపురం గ్రామంలో దాతలు శ్రీవారికి సమర్పించినభూములను పాత నక్ష ప్రకారం సర్వేచేసి అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకున్నాం. హద్దురాళ్లను పాతించాం. సర్వేరిపోర్టు వచ్చాక మ్యాప్ ఆధారంగా ఆ భూమిచుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. జమలాపురం ఆలయానికి సంబంధించిన భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. హద్దురాళ్లతో పాటు హెచ్చరిక బోర్డులను కూడా పెడుతున్నాం. ఆలయ భూములు ఆక్రమణకు గురైతే స్థానిక రైతులు, హక్కు భుక్తంలో ఉన్న కౌలుదారులు దేవస్థానం అదికారులకు సమాచారమివ్వాలి.

విద్యార్థులను క్రీడలకు సన్నద్ధం చేయాలి: పీవో

దుమ్ముగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):ఈ నెలలో జరిగే క్రీడాపోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సూచించారు. గురువారం ఆర్లగూడెం గిరిజన బాలుర ఆశ్రమపాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యపరిరక్షణలో భాగంగా మెనూ ప్రకారం సమయానుకూలంగా ఆహారం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలు, స్టోర్‌రూం, డార్మెటరీ, డైనింగ్ హాల్‌లతోపాటు వండిన ఆహారపదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం సమయానుకూలంగా ఆహారం అందిస్తున్నారా!? లేదా!? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట సిబ్బంది పరిశుభ్రతను పాటించాలని, టీచర్లు సిబ్బంది తిన్న తర్వాతే స్టూడెంట్స్‌కు ఆహారాన్ని వడ్డించాలన్నారు. టీచర్లకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్లొద్దని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత స్టూడెంట్స్‌తో కలిసి కొంతసేపు వాలీబాల్ ఆడారు. ఆయన వెంట స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, హెచ్‌ఎం సోమశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

నేటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విజయవంతం చేయండి: జిల్లా చైర్మన్ వీరబాబు

చుంచుపల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం కొత్తగూడెంలో ప్రారంభోత్సవ వేడుకలు జరుపుతున్నామని జిల్లా చైర్మన్ పసుపులేటి వీరబాబు, కార్యదర్శి కరుణకుమారి తెలియజేశారు. గురువారం వేడుకలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తొలి రోజు బాలల దినోత్సవ సందర్భంగా పిల్లల కార్యక్రమాలు, 15న పుస్తక ప్రదర్శన, 16న చిత్ర లేఖనం, 17న వకృత్వపు పోటీ, 18న వ్యాసరచన , 19న మహిళ కార్యక్రమం, 20వ తేదీన బహుమతి ప్రదానోత్సవం ముగింపు కార్యక్రమం జరుపబడునని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల కళాశాల విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వివరాల కోసం 9346382604, 9642600978 ఫోన్ నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం



వైద్య సిబ్బందితో జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం

పాల్వంచ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం అన్నారు. గురువారం పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని గుడిపాడు యూపీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వ్యాక్సినేషన్ గదిని, పాసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. ల్యాబ్, స్టోర్ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేసారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో కొద్దిసేపు మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. కార్యక్రమంలో గుడిపాడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్, పీహెచ్‌ఎమ్ నాగమణి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సమాచారం



మాట్లాడుతున్న కూరపాటి ప్రదీప్‌కుమార్

గ్రామీణ క్రికెటర్లను ప్రోత్సహించడమే లక్ష్యం

» త్వరలోనే రాష్ట్రస్థాయి తెలంగాణ గోల్డ్ కప్
» జోనల్ టీమ్ సెలెక్షన్ షెడ్యూల్‌ను ప్రకటించిన టీసీఏ బాధ్యుడు ప్రదీప్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రికెటర్లను ప్రోత్సహించడమే తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, వీరేష్‌గౌడ్ అన్నారు. గురువారం నగరంలోని నీక్వెల్ రిసార్ట్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే తెలంగాణ గోల్డ్‌కప్ టోర్నీ విధివిధానాలను, జోనల్ టీమ్‌ల ఎంపికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబరు నెలాఖరు నుంచి ప్రారంభమయ్యే తెలంగాణ గోల్డ్ కప్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఆరు జోన్ల నుంచి జట్లు పాల్గొంటాయన్నారు. ఒక్కో జోన్ నుంచి 5టీముల చొప్పున మొత్తం 30 టీములు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. అందులో భాగంగా మన ఖమ్మం ఈస్ట్ జోన్ పరిధిలోకి వస్తుందని, ఇక్కడి నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కోదాడ, మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి, ములుగు, పరకాల, హన్మకొండ, స్టేషన్‌ఘన్‌పూర్ జిల్లాల నుంచి ఆరు జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈనెల 18న ఖమ్మం జిల్లా జట్టును వేపకుంట్ల గ్రామంలో ఎస్ఎస్ గ్రౌండ్స్‌లో ఓపెన్ సెలెక్షన్స్ నిర్వహిస్తామన్నారు. ఎంపికలకు వచ్చే అభ్యర్థులు జనన ధ్రువీకరణ, ఆధార్‌తో ఉదయం 9 గంటల కల్లా గ్రౌండ్‌లో ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9848882551 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కూరపాటి ప్రదీప్ కుమార్, వీరేష్‌గౌడ్ కోరారు. ఈ సమావేశంలో క్రికెట్ సంఘం బాధ్యులు నరాల నరేష్, రాజీవ్ రాజ్, ఇర్షాద్, రాజశేఖర్, వెంకట్, ఫణి, ఖయ్యూం, రాధిక తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి ఉమ్మడి జిల్లా టీటీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 28 నుంచి 30 వరకు మోయినాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లను ఈనెల 15, 16 తేదీలలో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కోచ్ ఓలేటి సాంబమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో భాగంగా అండర్- 11, 13, 15, 17, 19 బాలురు, బాలికలతో పాటు పురుషులు, మహిళల విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి రాష్ట్ర పోటీలకు పంపుతామని ఆయన తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే అభ్యర్థులు ముందుగానే శుక్రవారం సాయంత్రం కల్లా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌తో ఉదయం 9 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 9848408335 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఓలేటి సాంబమూర్తి కోరారు.

సైజ్ తక్కువ చేప పిల్లలు మాకొద్దు..

» అధికారులు, కాంట్రాక్టర్‌పై ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆగ్రహం

ఇల్లెందురూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. కోట్లది నిధులు వెచ్చిస్తుంటే, అధికారులు, కాంట్రాక్టర్లు అవేమి పట్టనట్లు నాసిరకం చేప పిల్లలు చెరువుల్లో పోసి మత్స్యకారుల పొట్టకొట్టొద్దని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మత్స్యశాఖాధికారులపై, చేపపిల్లల కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఇల్లెందు మండలంలో 25 చెరువులు, కుంటలలో 3.50లక్షల చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఇల్లెందు మండల పరిషత్ కార్యలయంలో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధ నల ప్రకారం ఉండాల్సిన చేప పిల్లలు అందుకు విరుద్ధంగా చిన్న సైజులో ఉన్నాయని మత్స్య సహకార సంఘాల రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డీసీఎం వ్యాన్‌లో తీసుకువచ్చి న చేప పిల్లలను పరిశీలించిన ఎమ్మెల్యే చేప పిల్లల కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.పంపిణీకి సిద్ధంగా ఉన్న చేప పిల్లలను పరిశీలించి కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేసి, చేపపిల్లల పంపిణీ నిలుపుదల చేసి తెచ్చిన చేప పిల్లలను తీసుకొని వెళ్లిపోవాలని జిల్లా మత్స్యశాఖాధికారి ఇంతియాజ్ ఆహ్మద్‌కు సూచించారు. ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం ఉచితంగా చేప పిల్లను అందిస్తుందని, నిబంధనల ప్రకారం పెద్ద సైజు చేప పిల్లలు మత్స్య సహకార సంఘాలకు అందించాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లా మత్స్యశాఖాదికారి ఇంతియాజ్ ఆహ్మద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ తీసుకువచ్చిన చిన్న సైజు చేప పిల్లలను వెనక్కి పంపామని, ఈసారి పంపిణీ చేసే చేప పిల్లలను తాము పరిశీలించాకే జిల్లాలో మత్స్య సహకార సంఘాలకు పంపిణీ చేస్తామని తెలిపారు.



మత్స్యశాఖాధికారిని నిలదీస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఢిల్లీ బాంబు పేలుళ్లపై సమగ్ర దర్యాప్తు జరపాలి

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు




ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ ఎర్రకోట సమీపంలో చోటుచేసుకున్న కారు బాంబ్ బ్లాస్ట్ పేలుళ్లపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పోటు రంగారావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఖమ్మంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. అమాయక పౌరుల ప్రాణాలు తీయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఢిల్లీ పేలుళ్ల ఘటనలో మృతులు, గాయాలైన వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. దేశంలో పలు ప్రాంతాల్లో పేలుళ్లు జరగడం వెనుక అంతర్జాతీయంగా పాక్ ఉగ్రవాద మూక పాత్ర ఉందన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే కేంద్ర ప్రభుత్వం ఓ నాలుగు రోజుల పాటు హడావుడి చేసి.. ఆ తర్వాత వదిలి వేస్తోందని విమర్శించారు. ఉగ్రవాద చర్యలపై కఠినంగా శిక్షలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ, విదేశ ముష్కర మూక ఎవరైనా సరే.. ఏ మత ఉగ్రవాదాన్ని ఉపేక్షించొద్దని కోరారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా.. నిర్మూలించాలన్నారు. ఢిల్లీ పేలుళ్లు, ఉగ్రవాద ఘటనలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని అన్నారు.

మధుమేహం.. అవగాహనతోనే దూరం

» ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న షుగర్ బాధితులు
» నేడు వరల్డ్ డయాబెటీస్ డే

భద్రాద్రిలో 45,681 వ్యాధిగ్రస్థులు..



ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): "ఒక..టీ..! షుగర్ లేకుండా" ఏ హోటల్లో చూసినా "షుగర్ లేకుండా ఒక టీ !" అని ఆర్డర్ చేసేవాళ్లు.. ఇంటికి వచ్చిన నలుగురు అతిథుల్లో ఒకరయినా తన ప్లేట్లోని స్వీట్ల ని మరొకరి ప్లేట్లోకి మార్చేవాళ్లు.... ఈ మధ్య ఈ సన్నివేశాన్ని మనం ఎక్కువగా చూస్తునే ఉన్నాం.

నలభై ఏళ్లు నిండిన సాధారణ వ్యక్తికి వైద్యం సమయంలో చేసే సాధారణ పరీక్షలు బీపీ (రక్తపోటు) షుగర్ (మధుమేహం) నాలుగు పదులు దాటిన తర్వాత కనీసం 45-50 శాతం మందికి ఈ వ్యాధులు వస్తుంటాయనేది వైద్యులు ధృవీకరిస్తున్న వాస్తవం .. కానీ దీనికి భిన్నంగా ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వీటి బారిన పడుతూనే ఉన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వేల్లో మధుమేహ వ్యాప్తిలో జిల్లా 10వ జాబితాలో చేరింది. జిల్లాలో దీని బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది.

- మధుమేహం రావడానికి కారణాలు :

- మానవ శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవడాన్ని టౌప్-1 మధుమేహం అని, ఉత్పత్తి అయినా ఇన్సులిన్ సమర్థవంతంగా ఉపయోగపడకపోతే టౌప్-2 మధుమేహంగా భావిస్తారు. హార్మోన్ స్థాయి తగ్గడం రక్తంలో అధిక గ్లూకోజు వలన వచ్చే రుగ్మత ఈ మధుమేహం. అతిమూత్రం, బద్దకం, మందగించిన చూపు, అతిగా దాహం వేయడం సాధారణ లక్షణాలు. కుటుంబంలో తల్లిదండ్రులకు మధుమేహం ఉండటం అధిక బరువు, ఊబకాయం, ఎక్కువ శ్రమ లేని జీవితం గడిపేవారు మానసిక ఒత్తిడికి కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయి ఎక్కువగా ఉండడం వంటి కారణాలతో మధుమేహం బారిన పడేందుకు అవకాశం ఉంది. ప్రతి చోట దాదాపు 35శాతం యువత వ్యాధి బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

మధుమేహ వ్యాధిగ్రస్తులు సాధారణంగా నిత్యం ఒకే తరహా మాత్రలు వేసుకుంటున్నారు.

భద్రాద్రి జిల్లాలో 2023-2024 సంవత్సరంలో 54,630 మందికి 2024-25 సంవత్సరంలో 5,19500 మందికి, 2025 ఏప్రిల్ నుంచి నవంబరు వరకు డయాబెటీస్ పరీక్షలు 7,530 మందికి మొత్తం 5,19,760 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో 45,681 మందిని డయాబెటీస్ బాధితులుగా గుర్తించారు. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో సుమారు 30 శాతం పైగా డయాబెటీస్‌తో బాధపడుతున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ ఆస్పత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెట్‌పార్మిన్, గ్లిబెన్‌క్లామిడ్ మాత్రలు ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 పీహెచ్‌సీలు, 247 ఆరోగ్య ఉప కేంద్రాల్లో వేలాది మంది రోగులు నెలకోమారు మందులు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఎన్‌సీడీ విభాగాన్ని కూడా ఏర్పాటు చేసి నిత్య సేవలను అందిస్తున్నారు. దీనిలో దాదాపు జిల్లా ఇతర ప్రాంతాల నుంచి నెలకు 10వేల మందికి పైగా నిత్యం మందులు వినియోగించే వారు వస్తున్నారు. వీరిలో 40 ఏళ్లలోపు వారు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తున్న విషయం.

ఈ వ్యాధులను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అయుష్మాన్ భారత్ పథకం కింద నాన్ కమ్యునికేబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమాన్ని 2018లో ప్రారంభించింది. ఈ ఏడాది జిల్లాలో ఫిబ్రవరి నెలలో 30 ఏళ్లు పైబడిన వారిలో రక్తపోటు, మధుమేహం నోటి, రొమ్ము గర్భకోశ క్యాన్సర్‌కు గురైన వారిని గుర్తించే ప్రక్రియను ప్రారంభించింది.

విలేజ్ హెల్త్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో అప్పుడే పుట్టిన బిడ్డనుంచి వయో వృద్ధుల వరకు ప్రతి ఒక్కరినీ నమోదు చేస్తున్నారు. వీటిలో 30 ఏళ్లు పైబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో ఇలా ...

జిల్లాలో తాజాగా 13,35,202 జనాభా ఉండగా 8లక్షల 03వేల మంది 140 మంది 30 ఏళ్లపైబడిన వారు ఉన్నారు. వీటిలో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో 12,45,402 మందిని సర్వే నిర్వహించారు. అంటే జిల్లాలో దాదాపు 93.27శాతం సర్వే నిర్వహించారు. వీటిలో మధుమేహం లక్షణాలు ఉన్నవారు55,829 మంది ఉన్నారు. అధిక రక్తపోటు ఉన్నవారు77,604 మంది ఉన్నారు. జిల్లా జనాభాలో 12శాతం మధుమేహం ఉన్నవారు ఉండగా 14శాతం మందికి రక్తపోటు ఉన్నవారున్నట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా లక్ష 30వేల మందిని ఎన్సీడీ పోర్టల్‌లో నమోదు చేసి వారికి స్ర్కీనింగ్ నిర్వహిస్తున్నారు.



కొత్తగూడెంలో డయాబెటీస్ ఉచిత వైద్య శిబిరానికి హాజరైన వ్యాధిగ్రస్థులు(ఫైల్)

భయపడకుండా జీవించాలి

● డాక్టర్ తుకారాం రాథోడ్ , భద్రాద్రి డీఎంహెచ్‌వో



డయాబెటీస్ వ్యాధికి గురైన వారు భయపడకుండా ఉండాలి. జీవనశైలిలో వచ్చిన మార్పులు, వ్యాయామం లోపం, అధిక క్యాలరీలు ఉన్న ఆహారపు అలవాట్ల వల్ల కలిగే వ్యాధి ఇది. ఈ వ్యాధి ఇతర దీర్ఘకాలిక సమస్యలకు దారి తీస్తుంది. నిబంధనలు పాటిస్తూ, ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, సమతుల ఆహారం, క్రమం తప్పని వైద్య పరీక్షలతో ఆరోగ్యంగా జీవించాలని సూచించారు.

సూచనలు పాటించాలి

● డాక్టర్ శ్రావణ్‌కుమార్, షుగర్‌వ్యాధి నిపుణులు, ఖమ్మం



ఈ వ్యాధి లక్షణాలు కనిపించే వ్యక్తి నీరసంగా, పాలిపోయినట్లు కనిపిస్తుంటారు. ఎక్కువగా అలసటకు గురవుతారు. నీళ్ల తాగుతూ మూత్రానికి ఎక్కువ సార్లు వెళ్తుంటారు. వైద్యుల సూచనలు తీసుకుంటూ మందులను క్రమం తప్పకుండా తీసుకుంటే ఇన్సులిన్ ఉపయోగించకుండా వ్యాధిని దూరం చేసుకోవచ్చు. మధుమేహం బారిన పడేవారు ఏలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేడు అందుబాటులోకి రోగ నిరోధక మాత్రలు ఎన్నో వచ్చాయి. ఆహార నియమాలు పాటించాలి. తగిన వ్యాయామం చేయాలి. యోగా నడక క్రమం తప్పకుండా చేస్తుంటే మంచి ప్రయోజనం ఉంటుంది.

జైశ్రీరామ్ ఇటుకల తయారీకి శ్రీకారం

» రామానుగ్రహంగా భక్తులకు విక్రయించనున్న దేవస్థానం



భద్రాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జై శ్రీరామ్ నామంతో ఉన్న ఇటుకల తయారీకి ఇప్పటికే చర్యలు చేపట్టిన దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు గురువారం ప్రయోగాత్మకంగా తయారీ ప్రారంభించారు. స్థానిక చిత్రకూట మండపం సమీపంలో జైశ్రీరామ్ నామంతో ఇటుకల తయారీని లాంచనంగా ప్రారంభించారు. ఎర్రమట్టి, ఇసుక, సిమెంటు మిశ్రమంతో సుమారు 50 ఇటుకలను తొలి రోజున తయారు చేశారు. వీటిని 20రోజుల పాటు క్యూరింగ్ చేసి గట్టిదనాన్ని పరిశీలించి అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. కాగా.. ఇటుకల తయారీకి ముడి సరుకు లబ్ధి, వెసులుబాటు ఇతరత్రా వాటిని పరిగణనలోకి తీసుకొని వాటి ద్వారా తయారు చేస్తే ఒక ఇటుకకు దేవస్థానానికి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు తెలిపారు. ఈ నెల 11న భద్రాద్రి రామాలయం, పరిపాలన విభాగాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించిన సమయంలో బెంగళూరు నుంచి జైశ్రీరామ్ నామంతో ఇటుకల తయారీకి తీసుకొచ్చిన మౌల్డ్‌లను దేవస్థానం అధికారులకు అందజేశారు. రామాలయాన్ని దర్శించడానికి వచ్చే భక్తులు.. తమ నూతన భవన నిర్మాణ సమయంలో జైశ్రీరామ్ నామంతో ఉన్న ఇటుకలు వినియోగించుకునేలా దేవస్థానం వీటిని విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.



ఇటుకను తయారు చేస్తున్న దృశ్యం

సోలార్ విద్యుత్ విస్తరణకు చర్యలు వేగవంతం చేయాలి

» టీజీ రెడ్‌కో చైర్మన్ శరత్



మాట్లాడుతున్న రెడ్‌కో చైర్మన్ శరత్

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం జిల్లాలో సోలార్ విద్యుత్ విస్తరణకు చర్యలు వేగవంతం చేయాలి అని టీజీ రెడ్‌కో చైర్మన్ ఎ. శరత్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం, తెలంగాణ రాష్ట్ర పునరుత్పత్తి శక్తి అభివృద్ధి సంస్థ చైర్మన్ శరత్, ఐఏఎస్ (రిటైర్డ్) ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల స్థాపన, సౌర శక్తి వినియోగంపై కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సౌర విద్యుత్ వినియోగ విస్తరణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యవసాయ పంపులు మొదలైన చోట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని, అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని కలెక్టర్ తెలిపారు. చైర్మన్ శరత్ మాట్లాడుతూ, పీఎం కుసుమ్ పథకం కింద అమలవుతున్న సౌర విద్యుత్ ప్రాజెక్టుల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరా సౌర గిరి జలవికాసం పథకం కింద బోర్లు వేయడానికి తగిన ప్రదేశాలను శాస్త్రీయ పద్ధతిలో గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా రెండు మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లి, మణుగూరు మండలం ఉడతనేని గుంపులో స్థలాలు కేటాయించబడ్డాయని, వీటి స్థాపనకు అవసరమైన చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మోడల్ సోలార్ గ్రామాలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యంతో 80 గ్రామాలను గుర్తించారని తెలిపారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గండుగుల పల్లి గ్రామాన్ని ఆదర్శ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. గ్రామంలో అన్ని ఇళ్లకు సోలార్ సదుపాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో, పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా విద్యుత్ శాఖ అధికారి మహేందర్, టీజీ ఆర్‌జీడీసీవో జిల్లా మేనేజర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మగిసిన ఖమ్మం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

మధిర రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా స్థాయి ప్రభుత్వ పాఠశాలల వాలీబాల్ క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. రెండురోజులపాటు మధిరలోని టీవీఎం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. మొదటిరోజు అండర్-14విభాగంలో పోటీలు నిర్వహించగా రెండోరోజైన గురువారం అండర్-17 విభాగంలో పోటీలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని 22మండలాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్సాహపూరిత వాతావరణంలో క్రీడాకారుల కోలాహలం మధ్య ఈ పోటీలు జరిగాయి. అండర్-17 బాలికల విభాగంలో మొదటి బహుమతిని ఖమ్మం రూరల్ జట్టు గెలుపొందగా, రెండో బహుమతిని కల్లూరు, మూడో బహుమతి ఖమ్మం సౌత్ జట్లు గెలుపొందాయి. అండర్-17 బాలుర విభాగంలో మొదటి బహుమతి ఖమ్మం సౌత్ జట్టు, రెండో బహుమతి వేంసూరు జట్టు, పెనుబల్లి జట్టు మూడో బహుమతిని గెల్చుకున్నాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగిరెడ్డి పోటీలను సందర్శించారు. క్రీడాకారులకు బహుమతి ప్రధానోత్సవంలో ఎంఈవో వై.ప్రభాకర్, కమిషనర్ సంపత్‌కుమార్, తహసీల్దార్ రాంబాబు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలికల విభాగంలో మొదటి బహుమతి గెలుచుకున్న ఖమ్మం రూరల్ జట్టు

శతాధిక వృద్ధురాలి కన్నుమూత



ఉన్నీసాబేగం (ఫైల్)

దుమ్ముగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగరానికి చెందిన శతాధిక వృద్ధురాలు మహమ్మద్ అజీజ్ ఉన్నీసాబేగం (108) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు మొత్తం తొమ్మిది మంది సంతానం. కాగా వారిలో ఆరుగురు మగ, నలుగురు ఆడవారు. నాలుగు తరాలకు చెందిన తన సంతానాన్ని ఆమె చూశారు.

ఇసుక లారీ పట్టివేత

బూర్గంపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బుడ్డగూడెం నుంచి ఇసుకను తరలిస్తున్న లారీని గురువారం బూర్గంపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామ శివారు కిన్నెరసాని వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఒడ్డుకు చేర్చి అట్టి ఇసుకను లారీల ద్వారా పట్టణాలకు తరలిస్తున్నారని సమాచారంతో గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేకుండా లారీలో ఇసుకను లోడ్ చేసుకొని తలిస్తుండగా గుర్తించి, లారీలని పోలీసు స్టేషన్‌కు తరలించారు. బాధ్యులైన లారీ యజమాని, డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

1,800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బూర్గంపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇరవెండి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊట 1800 లీటర్లను ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ గణేష్ ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాస్, వారి బృందం ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. గ్రామంలో విచారణ అనంతరం ఆంగోత్ జంపన్న కేలోతు సంధ్య, అటవీ ప్రాంతంలో మిషన్ భగీరథ వాటర్ పైపులైన్ ద్వారా వచ్చే నీటిని ఉపయోగించి నాటుసారా తయారు చేస్తున్నట్లుగా వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈదాడుల్లో సిబ్బంది బాలు సుధీర్, హరీష్ వెంకట్, విజయ్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. నాటు సారా తయారీకి సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2523 అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు రహస్యంగా ఉంటాయని అసిస్టెంట్ కమిషనర్ గణేష్ తెలిపారు.

అగ్నిప్రమాదంలో బడ్డీ కొట్టు దగ్ధం

మధిర రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గ్రామంలో అగ్నిప్రమాదంలో బడ్డీ కొట్టు దగ్ధమైన సంఘటన బుధవారం అర్థరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సాధులూరి ఇస్రాయేలుకు చెందిన బడ్డీ కొట్టు బుధవారం రాత్రి కొట్టు బంద్ చేసి ఇంటికి వెళ్లిన తర్వాత దుకాణంలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఇస్రాయేలు కోరుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

దుమ్ముగూడెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండంలోని కె.రేగుబల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ములకపాడుకు చెందిన సోందె నవీన్ తీవ్రంగా గాయపడ్డాడు. నవీన్ తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న లారీ ద్వి చక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడిని స్థానికులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆటోను ఢీ కొట్టిన స్కూల్ బస్సు

● డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

బోనకల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో గురువారం ప్రైవేటు బస్సు రోడ్డు పక్కన ఆపి ఉన్న ఆటోను ఢీ కొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకునేందుకు చొప్పకట్లపాలేనికి వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో మలుపు వద్ద ఒక్కసారిగా స్టీరింగ్ లాకైంది. అదే సమయంలో రోడ్డు పక్కన సామన్లు విక్రయించే ఆటో ఆగి ఉంది. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ నల్లపు నరసింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిది ఏపీలోని నందిగామ మండలం రామిరెడ్డి పల్లి వాసిగా తెలిసింది. ప్రథమ చికిత్స చేసిన తరువాత 108 సిబ్బంది అతడిని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్కూల్ బస్సుకు స్టీరింగ్ లాక్ పడటాన్ని గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ఎమర్జన్సీ బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల గురించి ఆందోళనకు లోనయ్యారు. అక్కడకు చేరుకొని తమ పిల్లలను చూసుకున్న తరువాత ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

వీ వీ పాలెం సొసైటీ పనితీరు భేష్

» సొసైటీ, బ్యాంకు సేవలు పరిశీలించిన నాబార్డు జాతీయ బృందం



బృందం సభ్యులతో సొసైటీ చైర్మన్ రావూరి

రఘునాథపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రాథమిక సహకార సొసైటీ పరిదిలో బ్యాంకులకు మించిన స్థాయిలో రైతులు, పౌరులకు మంచి సేవలు అందిస్తూ పనితీరు లో జాతీయ స్థాయిలో అభినందనీయంగా ఉందని ఆదర్శవంతంగా కొనసాగుతుందని నాబర్డు జాతీయ బృందం సభ్యులు అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ సొసైటీగా ఎంపికైన వీ వెంకటాయపాలెం సొసైటీని గురువారం నాబర్డు జాతీయ బృందం సభ్యులు శ్రేయాష్ దేశ్‌పాండే, కొల్లి కృష్ణ పరిశీలించారు. సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, బ్యాంకు సిబ్బందితో మాట్లాడి బ్యాంకు నిర్వాహణ తీరును తెలుసుకున్నారు. కేవలం ఒక సొసైటీ పరిధిలో రూ.7.80 కోట్లు బంగారు రుణాలు ఇవ్వటం, రూ.3.5 కోట్లు డిపాజిట్లు కలిగి ఉండటం ఆదర్శనీయమన్నారు. సాదారణ బ్యాంకుల వలే క్యాష్ కౌంటర్లు, లాకర్లు, కామన్ సర్వీస్ సెంటర్లు నిర్వాహణ ఇతర సొసైటీలకు మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. సొసైటీ, బ్యాంకు ద్వారా అందించే సేవలను సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు వివరించారు. వైస్ ప్రెసిడెంట్ రావెళ్ల శ్రీనివాసరావు, సెంట్రల్ బ్యాంకు డీజీఎం వేణుగోపాల్‌రావు, బ్యాంకుమెనేజరు హిందు, కార్యదర్శి తిరుపతి రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమంలో లైజన్ సెల్ కీలకపాత్ర

కొత్తగూడెం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) సింగరేణిలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమంలో లైజన్ సెల్ కీలక పాత్ర పోషిస్తుందని సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ మోకాళ్ల తిరుమలరావు అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గురువారం సింగరేణి లైజన్ సెల్ కార్యాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లైజన్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఎస్సీఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోటినాగేశ్వరరావు, లైజన్‌సెల్ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్, కార్పోరేట్ లైజన్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, కొత్తగూడెం ఏరియా లైజన్ ఆఫీసర్ కల్వల చంద్రశేఖర్, కార్మిక సంఘాల నాయకులు వంగా వెంకట్, త్యాగరాజన్, పితాంబరం, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన జీఆర్పీ ఎస్పీ



సీఐ అంజలితో మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

ఖమ్మంక్రైం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందనాదీప్తి గురువారం ఖమ్మం రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైలులో, రైల్వేస్టేషన్‌లో జరిగే పలు నేరాలపై ఆమె తెలుసుకుని సిబ్బందికి తగుసూచనలు చేశారు. రైల్వే ప్రయాణికుల కోసం, ప్రజల కోసం జీఆర్పీ పోలీసులు పనిచేసి వారి మన్ననలు పొందాలన్నారు. పోలీసుశాఖ ప్రతిష్ఠను పెంచాలన్నారు. అనంతరం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీపోలీసు స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా చందనాదీప్తికి జీఆర్పీ సీఐ అంజలి ఎస్ఐ సురేష్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎస్పీ వెంట కాజీపేట రైల్వేడీఎస్పీ కృపాకర్ ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

అశ్వారావుపేట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో గురువారం జరిగింది. ఆంధ్రాలోని చింతలపుడి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన వాసవీకి మండలంలోని గుమ్మడివల్లి గ్రామనికి చెందిన టి.మాధవరావు అనే వ్యక్తితో తొమ్మిదేళ్ల క్రితం వివాహం అయింది. పెళ్లి అయిన నాటినుంచి వాసవిని అనుమానిస్తూ వేధిస్తుండేవాడు. తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలోనే పలుమార్లు కుటుంబసభ్యులు, గ్రామ పెద్దలు ఇద్దరికి నచ్చచెప్పేవారు. తిరిగి అతను వేధిస్తుండటంతో తనకు న్యాయం జరగటంలేదని భావించిన ఆమె రెండు రోజుల క్రితం చింతలపుడి స్టేషన్‌కు వెళ్లగా అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని సూచించారు. అనంతరం అశ్వారావుపేట స్టేషన్‌కు వచ్చారు. అయితే తనకు ఎక్కడా న్యాయం జరగడంలేదంటూ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. ఇదే విషయమై ఎస్ఐ యయాతిరాజు మాట్లాడుతూ వివాహిత స్టేషన్‌కు రాగా కౌన్సిలింగ్ ఇచ్చి పంపటం జరిగిందని, తన పుట్టిల్లు చింతలపుడిలో పోలీసులను సంప్రదించాలని సూచించానని తెలిపారు.

16న కర్ణాటకలో భద్రాద్రి రామయ్య కల్యాణం

భద్రాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని టుముకూరులో ఈ నెల 16న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో గురువారం శ్రీరామరథంతో వైదిక పరిపాలన అధికారులు, సిబ్బంది తరలివెళ్లారు. 15న శోభయాత్ర, 16న స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. అలాగే 18న ఏపీలోని నెల్లూరు జిల్లా జలదంకి మండలం కోదండ రామాపురంలో రామయ్య కల్యాణాన్ని నిర్వహించనున్నారు. దేవస్థానం తరపున పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, సిబ్బంది రత్నం శ్రీకాంత్, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, శ్రీ పెరంబుదూర్ మదన్‌మోహనాచార్యులు, శేషం కిరణ్‌కుమారాచార్యులు, వెంకటాచార్యులు సిబ్బంది వెళ్లారు. ఇదిలా ఉండగా రామయ్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అలాగే ఖమ్మానికి చెందిన కలకోట జగన్మోహన్‌రావు, పుష్ప దంపతులు స్వామివారి అన్నదానానికి 1,01,116లు విరాళం అందించారు.



16న నేలకొండపల్లిలో కమ్మ వారి వనసమారాధన

నేలకొండపల్లి,నవంబరు13(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం నేలకొండపల్లిలో కమ్మవారి కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు కాకతీయ కమ్మ సేవా సమితి నాయకులు చవళం ప్రవీణ్‌కుమార్, మద్దినేని మహేష్, అక్కినేని నాగేశ్వరరావు, కడియాల నగేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ బీసీ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడితోటలో కార్తీక వనసమారాధనను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున కమ్మ సోదర సోదరీమణులు తప్పనిసరిగా కార్తీక వన సమారాధనకు హాజరయి, విజయవంతం చేయాలని ప్రకటనలో కోరారు.

దాతల దాతృత్వం.. అధికారుల నిర్లక్ష్యం

» ప్రభుత్వాస్పత్రిలో మూలనపడ్డ అంబులెన్స్, వాటర్ ప్లాంట్




యూనియన్‌బ్యాంకు ఇచ్చిన అంబులెన్స్, తాళంవేసిన ఉన్న రక్షిత మంచినీటి పథకం

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న రోగులకు, వారి సహాయకుల కోసం ఎంతో మంది దాతలు సేవ చేసేందుకు ముందుకు వస్తునే ఉన్నారు. దాతలు స్పందించి రోగులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు, సదుపాయాలను కల్పిస్తుంటే వాటిని మాత్రం అధికారులు అలక్ష్యం చేస్తున్నారు. దీంతో దాతల సదుద్దేశ్యం నీరుగారుతోంది. ఫలితంగా అవి నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి.

రోగులకు సేవలు మరిచి....!

అంబులెన్స్.. ఇది అత్యవసర రోగులకు సేవలు అందించే వాహనం అని అందరికీ తెలుసు. గత ఏడాది క్రితం యూనియర్ బ్యాంకు అధికారులు జిల్లా ఆస్పత్రికి ఉచితంగా అందచేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, అత్యవసర పరిస్థితుల్లో వారికి సేవ చేయాల్సిన ఈ అంబులెన్స్‌ను మాత్రం అధికారులు తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. అంబులెన్స్‌లో ఉండాల్సిన సౌకర్యాలను కూడా కల్పించకుండా సీట్లను ఏర్పాటు చేసి అధికారులు కలెక్టరేట్‌కు వెళ్లాలన్నా.. అటెండర్లు ఏమైనా సామాన్లు రవాణా చేయాలన్నా అంబులెన్స్‌ను వినియోగిస్తున్నారు. బుధవారం ఓ అటెండర్ కార్యాలయం పనికోసం కలెక్టరేట్‌కు వెళ్తుండగా ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది. గతంలో కూడా అప్పటి సూపరిన్‌టెండెంట్ దీన్ని తన వాహనంగా వినియోగించారు.

తెరుచుకోని రక్షిత మంచినీటి పథకం..!

ఎంసీహెచ్‌కు అనుసంధానంగా ఓ మిత్ర మండలి సొంత ఖర్చులతో రోగులకు, సహాయకులకు, ఆస్పత్రికి వచ్చే వారి కోసం ఆర్వో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. 2023లో సుమారు రూ.5 నుంచి 6లక్షలతో ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంటు ప్రస్తుతం మూలన పడింది. వీటికి కనీస మరమ్మతులు చేయించ లేక అధికారులు తాళం వేసి ఉంచారు. ఏడాది పాటు పనిచేసిన ఈ వాటర్ ప్లాంటును ఇటీవల తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ స్పందించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చినా, అనతికాలంలోనే అది మూలన పడింది. దీంతో దాతల దాతృత్వానికి విలువే లేకుండా పోతోందని పలువురు పెదవివిరుస్తున్నారు. దీంతో మంచినీటి కోసం జనరల్ ఆస్పత్రి ప్రధాన ద్వారం వరకు వెళ్లాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు.

రైతును రాజును చేస్తాం

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బుద్దారంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేసే దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్ చర్యలు తీసుకుంటున్నదని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదల సొంతింటి కలను రేవంత్ సర్కార్ నెరవేరుస్తుంన్నదన్నారు. ప్రభుత్వం వచ్చాక దాదాపుగా 5లక్షల ఇళ్లను పేదలకు మంజూరు చేసామన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో ఇందిరమ్మ ఇళ్ల సొమ్మును జమ చేస్తున్నామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 58మంది లబ్ధిదారులకు రూ.20.29లక్షల విలువైన సీఎమ్మార్ఎఫ్ చెక్కులను మంత్రిపొంగులేటి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, ఆరెకట్ల గురునాధం, చిట్టూరి అచ్చయ్య, తెలుగుదేశం నాయకుడు ఆరెకట్ల కొండలరావు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమేష్,తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందిస్తాం

తిరుమలాయపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనదించి వారికి ఉజ్వల భవిష్యత్ అందించేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. తిరుమలాయపాలెం నుంచి పోచారం వరకు రూ.3కోట్లతో చేపడుతున్న బీటీరోడ్డు నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. తిరుమలాయపాలెంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో రూ.60లక్షలతో చేపడుతున్న భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కేజీబీవీల్లో మరమ్మతుల పనులకు రూ.61లక్షలు మంజూరు చేశామని చెప్పారు. ఈకార్యక్రమంలో జేసీశ్రీనివాసరెడ్డి, డీఈవో చైతన్యజైనీ, ఆర్అండ్‌బీఎస్ఈ యాకోబు, ఎస్వో రమాకుమారి, ఆత్మకమిటీచైర్మన్ చావా శివరామకృష్ణ, ఓర వెంకటేశ్వర్లు, బోడ మంగీలాల్, ఏవో సీతారాంరెడ్డి,తహసీల్దార్‌లూథర్‌విల్సన్,ఎంపీడవో సిలార్‌సాహెబ్, స్పెషలాఫీసర్ రమేష్ ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్, వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఉన్నం రాజశేఖర్, మందడి ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీకి 'ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్' అవార్డ్



ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఐటీసీఅకాడమీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రిడ్జ్‌కార్యక్రమంలో ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు ఎడ్యుకేషన్ చేంజ్‌మేకర్ అవార్డ్ అందుకుందని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్రఐటీ శాఖమంత్రి పళనివేల్ త్యాగరాజన్ చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కేవలం మూడు కళాశాలలను మాత్రమే ఎంపిక చేయగా, తమ కళాశాల మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్‌వో రామారావు

కొణిజర్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి):వైద్యసిబ్బంది అంతా సమయానికి విధులకు హాజరై ప్రజలకు వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి డి.రామారావు పేర్కొన్నారు. గురువారం ఆయన కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్య కంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, రికార్డులను, ఓపీని పరిశీలించారు.

'చాంబర్' ఎన్నిక ప్రతిష్టాత్మకం

ఢీ అంటే ఢీ అంటున్న అభ్యర్థులు

16న జరిగే ఎన్నికలపై నగర వాసుల ఆసక్తి





గాంధీచౌక్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మేళ్లచెర్వు ప్యానల్, గెట్‌టూగెదర్ కార్యక్రమం ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ ప్యానల్

ఖమ్మంమార్కెట్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఈనెల16న ఆదివారం జరగనున్న 'చాంబర్ ఆఫ్ కామర్స్' ఎన్నికల ప్రక్రియ రోజురోజుకి హీటెక్కుతోంది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రెండు ప్రధాన ప్యానల్ సభ్యులు పావులు కదుపుతున్నారు. వాణిజ్య, వ్యాపారాలకు సంబంధించిన శాఖల మధ్య పోటీ ఎలా జరుగుతుందోనని, గెలుపు గుర్రాలు ఎవరో అని నగర వాసులు ఉత్కంఠతో పాటు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విందు, మందు, గెట్ టూగెదర్ భేటీలు ఆసక్తి రేపుతున్నాయి. మామూలుగా చెప్పాలంటే చాంబర్ ఎన్నిక ఒక ఎమ్మెల్యే స్థానానికి పోటీలా ఉందని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలకతీతంగా ఎవరికి సంబంధం లేకుండా ఎన్నికలు జరుగుతుండటం విశేషం. పోటీదారులు అందరూ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడమే కాకుండా ఎవరికి వారు తమకు ఓట్లేసే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రచారాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్క సభ్యుడిని ఆప్యాయంగా పలకరిస్తూ, అందుబాటులో లేని వారిని ఫోన్‌లో అభ్యర్థిస్తూ దూసుకు పోతున్నారు. అనుభవజ్ఞులను ఆశీర్వదిస్తారా, యువతరానికి స్వాగతం పలుకుతారా అని ఉత్కంఠ రేకెత్తిస్తుంది చాంబర్ పోరు.

> **18 శాఖలు, 1,305 ఓటర్లు**
>
> చాంబర్ ఆఫ్‌కామర్స్ ఎన్నికల్లో ప్రస్తుతం 18వ్యాపార శాఖలు ఉన్నాయి. అందులో మొత్తం 1305మంది సభ్యులు ఓటు హక్కును కలిగి ఉన్నారు. చాలావరకు శాఖలు ఏకగ్రీవాలుగా ఎన్నుకుంటూ ఒకరి తరువాత ఒకరు ప్రధాన పదవులలో కొనసాగుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించిన దిగుమతి, ఎగుమతి, మిర్చి, కోల్డ్‌స్టోరేజీశాఖ, వెండి, బంగారు శాఖలకు దృడమైన అభ్యర్థులు బరిలో నిలిచారు. పోటీలో ఉన్న అభ్యర్థులు బంధుగణాన్ని, ప్రైవేటు వ్యక్తులను సైతం తమ ప్రచారంలో తిప్పుకోవడం విశేషం.

ప్రధాన పోటీ వారి మధ్యే

నగరంలోని వ్యాపార సామ్రాజ్యానికి చిరునామాగా ఉన్న చాంబర్ ఎన్నికల్లో ప్రధానంగా పోటీకి అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, గొడవర్తి శ్రీనివాసరావు ప్యానల్‌తో పాటు మేళ్ళచెర్వు వెంకటేశ్వరరావు, జీవై నరేష్ ప్యానల్ మధ్యనే ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా అధ్యక్ష పదవికి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కొదుమూరి మధుసూధన్‌రావు, కొప్పుల కోటేశ్వరరావులు సైతం బరిలో నిలవడం విశేషం. ఉపాధ్యక్ష పదవికి కురువెళ్ళ లక్ష్మీకాంతరావు, బత్తిని నర్సింహరావు, సహాయ కార్యదర్శి పదవికి బాదె రమేష్, ముత్యం ఉప్పల్‌రావు, కోశాధికారి పదవికి కైలాసపు వేణుగోపాలరావు, తల్లాడ రమేష్, తూములూరి లక్ష్మీనర్సింహరావు, దిగుమతి శాఖ అధ్యక్ష పదవికి కోలేటి నవీన్‌కుమార్, వడ్డె వెంకటేశ్వర్లు, సోమిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పదవికి యాత్రా అప్పారావు, సోమారపు సుధీర్‌కుమార్, ఆత్మకూరి వెంకటరామారావు, మిర్చిశాఖ అధ్యక్ష పదవికి బండారు వీరబాబు,మెంతుల శ్రీశైలం, కార్యదర్శి పదవికి యడ్లపల్లి సతీష్, చింతల రామలింగేశ్వరరావు, ఎగుమతిశాఖ అధ్యక్ష పదవికి నల్లమల ఆనంద్, మన్నెం క్రిష్ణ, వెండిబంగారంశాఖ అధ్యక్ష పదవికి బందు సూర్యం, విజయగిరి సదానందచారి, సెక్రెటరీ పదవికి నకిరకంటి సతీష్, బూర్లె లక్ష్మీనారాయణ ప్యానల్‌లు, 10మంది అభ్యర్థులు సెంట్రల్ ఈసీమెంబర్లు బరిలో నిలిచారు. కోల్డ్ స్టోరేజీశాఖ, దాల్‌మిల్, ఆయిల్‌మిల్, క్లాత్ అండ్‌రెడీమేడ్, కిరాణం, ఎగుమతి శాఖ కార్యదర్శి, డిస్ట్రిబ్యూటర్స్ జనరల్ మనియార్, సామిల్, ఇనుము, క్యాన్వాసింగ్, అగ్రికల్చర్ మోటర్స్‌కలప,సిమెంట్,ధాన్యంశాఖలు అధ్యక్ష, కార్యదర్శి పదవులతో పాటు పలు శాఖల ఈసీ మెంబర్ల పదవులు ఏకగ్రీవమయ్యాయి.

1939 నుంచి చాంబర్ ప్రస్థానం

నగరంలోని వ్యాపార వర్గాలకు ఏవైనా సమస్యలు వచ్చినా, ఇబ్బందులు వచ్చినా పరిష్కారానికి ఒక వేదిక ఉండాలన్న ఉద్దేశ్యంతో నాటి వ్యాపారులు తొలిసారిగా 1939లో చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసుకున్నారు. నాడు ఆకుల పూర్ణానందగుప్తా వ్యవస్థాపక అధ్యక్షుడిగా ప్రారంభమైన చాంబర్ నేటికి 86 వసంతాలు పూర్తిచేసుకుంది. నాటినుంచి నేటి వరకు 8మంది అధ్యక్షులు, 14మంది ప్రధాన కార్యదర్శులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆనాటినుంచి నేటివరకు కొన్ని ఏకగ్రీవ ఎన్నికలు కాగా మరి కొన్ని ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. 3సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికలకు ప్రధానంగా 1995నుంచి ఎన్నికల్లో పోటీ తత్వం పెరిగి ఎక్కువ మంది బరిలో నిలవడం ప్రారంభమైంది.

పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం

తిరుమలాయపాలెం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లచెరువు గ్రామానికి చెందిన సిరసవాడ నాగమ్మకు వివిధ పార్టీల నేతలు గురువారం నివాళలర్పించారు. ఆమె ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా దశదిన కార్యక్రమం జరిగింది. పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు జిల్లా కాంగ్రెస్‌నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు.నివాళులర్పించినవారిలో చావా శివరామకృష్ణ, బోడ మంగీలాల్, కమ్మకోమటి నాగేశ్వరరావు, కొమ్ము శ్రీను పాల్గొన్నారు.

సీఎస్ఐ భూములు మంత్రికి వినతి

తిరుమలాయపాలెం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిరిపురంలో డోర్నకల్ బిషప్ అజరయ్య మినిస్ట్రీస్ ఆధ్వర్యంలోనిభూములు అన్యాక్రాంతం కాకండా కాపాడాలని గురువారం మాదిరిపురం గ్రామస్తులు మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. మాదిరిపురంలోని సీఎస్ఐకు చెందిన భూములను మహబాద్‌జిల్లా మరిపెడ మండలం గాలివారిగూడేనికి చెందిన దామోదరరెడ్డి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి చర్చిభూములను కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్నాడనిపై చర్య తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో కాగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయేల్, దారా వెంకటరత్నం,ఇర్రి కళ్యాణ్,పప్పుల మల్లేశం, బెస్తా సంజీవరావు పాల్గొన్నారు.

ప్రజల భద్రతను కాంగ్రెస్ విస్మరించింది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి



మాట్లాడుతున్న నెల్లూరి

ఖమ్మంబైపాస్‌రోడ్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. నగరంలోని జిల్లాపార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఇటీవల జరిగిన పలుఉగ్రవాద ఘటనలకు సంబంధించి ఖమ్మంలోనే మూలున్నయని, నిఘావర్గాలు హెచ్చరిస్తుంటే కాంగ్రెస్ పరభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడున్న కొందరు రోహింగ్యాలకు ఆశ్రయ కలిపిస్తున్నారని, దీనివల్ల ఇక్క జరుగుతున్న కీలక సమాచారం పరాయి దేశాలకు చేరే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రమూలాలపై దృష్టిసారించి ఖమ్మం భద్రతకు కట్టుబడి ఉండాలన్నారు. లేని పక్షంలో బీజేపీ పెద్దఎత్తున ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. ఈసమావేశంలో దొంగల సత్యనారాయణ, గుత్తా వెంకటేశ్వర్లు, నాయుడు రాఘవరావు, ప్రవీణ్, వీరవల్లి రాజేష్, నరేష్, రవిరాథోడ్, బెనర్జి,సురేష్ పాల్గొన్నారు.

ఆగిన మట్టి అక్రమ రవాణా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేలకొండపల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండ్రాజుపల్లిలో కాంట్రాక్టర్ మట్టి తరలింపును నిలిపి వేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'అక్రమంగా మట్టి రవాణా..' ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి నుంచి తోలకాలు, పట్టించుకోని అధికార యంత్రాంగం కథనానికి స్పందించి తోలకాలను నిలిపి వేసినట్లు సమాచారం. అయితే మట్టిని తవ్వటానికి ఉపయోగించే పొక్లెయిన్ మాత్రం రోడ్డు పైనుంచే తరలించినట్లు తెలుస్తున్నది. పొక్లెయిన్ రోడ్డుపై నుంచి వెళితే రోడ్డు పాడై పోతుందని తెలిసినా కొంతదూరం రోడ్డు పైనుంచే తీసుకెళ్ళినట్లుగా సమాచారం. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ భూమి నుంచి మట్టి తోలకాలను నిరోధించాలని, కాంట్రాక్టర్ ఇప్పటికే తోలిన మట్టికి సెస్సురూపంలో ప్రభుత్వానికి రావలసిన పన్నులను రాబట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నగరంలో పోలీసుల విస్తృత తనిఖీలు



వాహనదారులను తనిఖీ చేస్తున్న సీఐ భానుప్రకాష్

ఖమ్మంక్రైం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు కట్టడి చేసేందుకు పోలీసులు ఖమ్మంనగరంలో పలు ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విజిబుల్‌పోలీసింగ్ పటిష్టంగా అమలుచేస్తే నేరాలు నియంత్రణలో ఉంటాయన్న నేపథ్యంలో పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అవసరంలేకున్నా అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతున్న అనుమానితులు తారసపడితే వారి గురించి పూర్తి వివరాలు సేకరించి సిటీపోలీసు యాక్టుకింద కేసులు నమోదు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఖమ్మంక్రైం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనపై ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి కేసులు నమోదయ్యాయి.చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన కేతబోయిన కావ్య (22) నగరంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో పని చేస్తుంది. ఈనెల 5న తాను నివస్తున్న ఓ ఇంటిలో పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. గమనించిన స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. కాగా పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాలనీకి చెందిన మంచికంటి తేజశ్రీ(24) డిగ్రీ పరీక్షలు ఎన్నిసార్లు రాసిన పాస్ కావడం లేదని మనస్థాపంతో గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మరోఘటనలో దానవాయిగూడేనికి చెందిన షేక్ యాకుబ్(33) అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డడు. ఈ ఘటనలపై బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీసీల శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

ఖమ్మంరూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బీసీల స్మశాన వాటిక స్థలాన్ని వేరొక సామాజిక వర్గం వారు తమదేనని వాదిస్తూ అన్యాయం చేస్తున్నారని రెవెన్యూ అధికారులు వెంటనే న్యాయం చేయాలని ఎమ్ వెంకటాయపాలెం గ్రామానికి చెందిన బీసీ కులాల నాయకులు తహసీల్దార్ రాంప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వెంకటాయపాలెం గ్రామం శివారులో గ్రామానికి చెందిన చాకలి, పద్మశాలి, ముదిరాజ్, కుమ్మరి, గౌడ, మంగళి, కంసలి, యాదవ తదితర బీసీ కులాల ప్రజలు గ్రామ శివారులోని స్థలాన్ని శ్మశాన వాటికకు వినియోగించుకున్నాయని తెలిపారు. ఆ ప్రక్కన గ్రామంలోని మరో సామాజిక వర్గానికి చెందిన వారిది స్మశానవాటికి ఉందన్నారు. ఈప్రభుత్వ భూమిని మొత్తం సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు. స్థలాన్ని పరిశీలించి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెకన్న, నాగేశ్వరరావు,ఉపేందర్, నర్సింహరావు, కుర్రా వెంకన్న, యాదగిరి, నాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీచౌక్ శివాలయం రోడ్డు పరిధిలో విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పాడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు తహసీల్దార్ కార్యాలయం, సాయిరాం థియోటర్, వీరాంజనేయ స్వామి ఆలయం, కాల్వోడ్డు, డీమార్ట్, ట్రంక్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

వీధి కుక్కల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

ఏబీసీ సెంటర్‌కు తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వీధికుక్కల్ని పట్టుకుంటున్న సిబ్బంది

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల్ని నియంత్రించేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈనెల10న ఆంధ్రజ్యోతిలోప్రచురితమైన 'కుక్కల్ని పోషిస్తున్న కేఎంసీ' కథనంపై ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ స్పందించారు. వీధులు, పార్కులు వెంట ఉండే కుక్కలపై రెండు రోజులుగా ప్రత్యేకడ్రైవ్ చేపట్టారు. యజమాని లేకుండా ఉండే వీధి కుక్కల్ని ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహించే యానిమల్ బర్త్‌కంట్రోల్ సెంటర్‌కు తరలిస్తున్నారు.

ఏఐకేఎంఎస్ నాయకులపై కేసు నమోదు

రఘునాథపాలెం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రజాజీవనానికి ఆటంకం కలిగించినందుకు సీపీఐ(ఎంఎల్) అనుబంధ ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ నాయకులు ఎస్‌కే సుభాని, గోగ్రైపాటి రమేశ్, ఆవునూరి మధు, వజ్జూరి వెంకట్రామిరెడ్డి, ఏనుగుల ప్రకాష్, కోలా లక్ష్మీనారాయణ మరికొంతమంది కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్ ఎదుట వచ్చే పోయే వాహనాలకు ఆటంకం కలిగించారన్నారు. కలెక్టర్ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించారని, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించినందుకు సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రజాసమస్యలు, ఇతర సమస్యలపై ధర్నాలు, నిరసనలు చేయాలంటే ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలని చెప్పారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు నమోదు జరుగుతాయని హెచ్చరించారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

దేవాదాయ, ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ



గుంటుమల్లేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణ

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎం. రామకృష్ణ ఆదేశించారు. గురువారం నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు.ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా జరుగుతున్న పూజలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ఆలయాలతో పాటు గుంటుమల్లేశ్వర స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, కోర్టులో ఉన్న భూములను పరిరక్షించేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాని అధికారులను ఆదేశించారు. ఆలయ భూములకు సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా దేవాదాయ, ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి, ఆలయ ఈవో రామకోటేశ్వరరావు,మేనేజర్ వెంకటేశ్వర్లు, అర్చకులు వీరభద్రశర్మ, కృష్ణ శర్మ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ZONE
శుక్రవారం 14 నవంబరు 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి



పెనుబల్లిలో షిర్డీసాయిబాబా పల్లకీ సేవ



పెనుబల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలో షిర్డీసాయి మాలధారులు గురుస్వామి బొర్రా శ్రీనుస్వామి ఆధ్వర్యంలో గురువారం షిర్డీసాయిబాబా పల్లకి సేవ నిర్వహించారు. సాయిబాబాను పల్లకిలో కూర్చోబెట్టి పెనుబల్లి రామాలయం వీధిలో ఉన్న పీఠం నుంచి పెనుబల్లి, వీఎంబంజర్ రింగ్ సెంటర్ మీదుగా తదితర రహదారుల్లో పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో మాలధారులు రామారావు స్వామి, కృష్ణ స్వామి, రావుల శ్రీను స్వామి పాల్గొన్నారు.

రెండో విడత ఇందిర డెయిరీ అభివృద్ధికి ఏర్పాట్లు చేయండి

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



అధికారులతో సమీక్షలో భట్టి విక్రమార్క

ముదిగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండో విడత ఇందిరా డెయిరీ అభివృద్ధికి ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరా డెయిరీ అభివృద్ధి కోసం ఏర్పాట్లు చేయాలని, అందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న పనులను సమీక్షించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయడంతోపాటు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మధిరలో జరుగుతున్న ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులపై సమీక్షించారు. నియోజకవర్గంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా...? ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, అధికారులు బాధ్యతగా పనిచేయాలని భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. భట్టి విక్రమార్క అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య, డీఈవో చైతన్య జైనీ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రాయల నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ధనసిరి పుల్లయ్య, డీపీవో ఆశాలత, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, ఎంపీవో వాల్మీకి కిషోర్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తా చాటాలి

» బీసీ గురుకులాల క్రీడల్లో ఓవరాల్ చాంపియన్ ముసలిమడుగు, లంకపల్లి విద్యార్థులు
» గురుకులాల రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి సైదులు



మాట్లాడుతున్న సైదులు



క్రీడల్లో గెలిచిన ముసలిమడుగు జట్టు

వైరా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతోపాటు కనీసం ఇండోర్ లేక అవుట్‌డోర్ గేమ్స్‌లో సత్తా చాటాలని రాష్ట్ర మహాత్మాజ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి, ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకాల ప్రత్యేక కార్యదర్శి బడుగు సైదులు విద్యార్థులకు సూచించారు. మండలంలోని రెబ్బవరం బీసీ గురుకుల బాలికల పాఠశాలలో మూడు రోజులపాటు జరిగిన బీసీ గురుకులాల విద్యాసంస్థల జిల్లాస్థాయి క్రీడల గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి అక్కడ సత్తా చాటిన వారిని జాతీయస్థాయిలో పతకాలు సాధించేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈనెల 15నుంచి 25వతేదీ వరకు సాంస్కృతిక, సాహిత్య, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్‌సీవో చింతమళ్ల రాంబాబు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డీసీవోలు ఎం.సుష్మా, బుల్యా రాణి జ్యోతి, ప్రిన్సిపాల్ కె.రాధిక పాల్గొన్నారు. ఈ క్రీడల్లో అండర్-14 విభాగంలో ముసలిమడుగు పాఠశాల విద్యార్థులు వ్యక్తిగత చాంపియన్‌గా, వైరా గురుకుల విద్యార్థిని వి.భానుతేజ, అండర్-19 విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా లంకపల్లి జూనియర్ కాలేజీ, వ్యక్తిగత చాంపియన్‌గా సత్తుపల్లి జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థిని ఎస్.మాధురి నిలిచారు.

వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

» వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొంగులేటి..

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపురంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి (శివాలయం) ఆలయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం సందర్శించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూత మంత్రి పొంగులేటి కలియ తిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతు ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. అంతకు ముందు ఆలయ అర్చకులు కొటపాటి మురళి, కోట్ల నందీశ్వరశర్మ, మంత్రి పొంగులేటికి ఎదురేగి స్వాగతం పలుకుతూ హరతులిచ్చారు. తదనంతరం స్వామివారి తీర్థప్రసాదములు స్వీకరించారు.

పసుమర్తి కుటుంబానికి సండ్ర పరామర్శ



సుభద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సండ్ర

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఇటీవల ఆనారోగ్యంతో ఆర్యవైశ్య ప్రముఖురాలు పసుమర్తి సుభద్రమ్మ మృతిచెందారు. ఈ మేరకు సమాచారం అందుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో పాటుగా ఆ పార్టీ శ్రేణులు గురువారం పసుమర్తి కుటుంబాన్ని పరామర్శించారు. సుభద్రమ్మ కుమారులైన ఆర్యవైశ్య సంఘం నాయకులు పసుమర్తి రాంబాబు, శ్రీనువాసరావులను పరామర్శించి సానుభూతి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, పెద్దబోయన మల్లేశ్వరరావు, ఎస్‌కె కమ్లి, మేకల కృష్ణ, కొరకొప్పు ప్రసాద్, చారుగుండ్ల కిరణ్, సందీప్, పొట్రూ కిరణ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రేపే కల్లూరులో మెగా నేత్ర శిబిరం

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో శనివారం మెగా నేత్ర ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా ఈ వైద్య శిబిరాన్ని మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మెగా నేత్ర వైద్య శిబిరంలో ఏపిలోని తిరువూరకు చెందిన శంకర నేత్ర వైద్యాలయం వారిచే కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఈ శిబిరాన్ని శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ ఆవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కంటి రోగ బాధితులను కోరారు. అవసరమైన వారికి రూ. 2 వేలకే కంటి ఆపరేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం



ప్రిన్సిపాల్ నవీనజ్యోతి పర్యవేక్షణలో గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైరా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వాడకాన్ని నిరోధించాలని కోరుతూ వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం గోడపత్రికల విస్తృత ప్రచారం చేశారు, జూనియర్ కళాశాల యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా రూపొందించిన గోడపత్రికలను ప్రిన్సిపాల్ ఎల్.నవీనజ్యోతి ఆవిష్కరించారు. అనంతరం గోడపత్రికలతో ప్రచారం చేశారు. జనసంచారం కలిగిన ప్రాంతాల్లో ప్రచార గోడ పత్రికలను అంటించారు. అధ్యాపకులు స్వప్న, శంకర్, కె.సురేష్, ఎన్.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

వరి క్షేత్ర సందర్శన



వరి క్షేత్ర సందర్శనలో వ్యవసాయ అధికారులు

వైరా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడి గ్రామంలో గురువారం వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ ఆధ్వర్యంలో వరిక్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణశ్రీ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను ప్రతి గ్రామానికి అందించే పథకంలో భాగంగా గొల్లపూడిలో సాగుచేసిన వరి రకం డబ్ల్యూజీఎల్44 పంటను సందర్శించామని తెలిపారు. ఇది 140నుంచి 145రోజుల పంట కాలం కలిగి ఉంటుందని, సాంబమసూరిని పోలి ఉంటుందని తెలిపారు. ఎకరాకు 25నుంచి 28క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్ రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పావని, డాక్టర్ పణిశ్రీ, ఆదర్శరైతు తుమ్మల రాణాప్రతాప్, ఏఈవోలు పాల్గొన్నారు.

సమయానికి విధులకు హాజరుకావాలి

» డీఎంహెచ్‌వో రామారావు

కొణిజర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది అంతా సమయానికి విధులకు హాజరై ప్రజలకు వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి. రామారావు పేర్కొన్నారు. గురువారం ఆయన కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్యకందార్న్ని తనిఖీచేశారు.ఈసందర్భంగా ఆసుపత్రిలోని ల్యాబ్, రికార్డులను, ఓపీని పరిశీలించారు. సిబ్బంది అంతా డ్యూటీ టైం ప్రకారం 9-30గంటలలోపు హాజరుకావాలని ఆదేశించారు. ప్రజలకు సరిపడా మందులు, అందుబాటులోఉంచాలని తెలిపారు. 30 ఏళ్లుదాటిన ప్రతి ఒక్కరికి షుగర్, బీపీ, ఇతర పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు లైఫ్‌స్టైల్, మోడిఫికేషన్ మీద అవగాహన కలిపించాలన్నారు. అక్కడే ఉన్న పలువురు రోగులను వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల వైద్యాధికారి శారద, స్టాఫ్ నర్స్ రజిని, ఎల్‌టీ వీరయ్య, హెల్త్‌సూపర్‌వైజర్ భాస్కరరావు, రోజారాణి, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, పాల్గొన్నారు.

వరికోత మిషన్ల కోసం రైతుల అవస్థలు



ముమ్మరంగా సాగుతున్న వరి కోతలు

కారేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొంతమేర వరి పంట దెబ్బతిన్న మిగిలిన వరిపంట కోతకు వచ్చింది. దీంతో రైతులు వరి కోతలు ప్రారంభించి వరి దాన్యం ఇంటికి చేర్చుకోవాలనే తపనలో ఉన్నారు. వరి కోతలకు కూలీలు దొరకకపోవడంతో వరి కోత మిషన్లపై ఆదారపడ్డారు.ఇతర జిల్లాల నుంచి వస్తున్న వరికోత మిషన్ల కోసం పడిగాపులుకాస్తూ మిషన్లు రాగానే వాటితో వరి కోత కోయిస్తున్నారు. ఈ నెలలో 17నుంచి బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వస్తున్న వాతావరణ వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు రాకముందే పంట దిగుబడులను ఇండ్లకు చేర్చుకోవాలనే తపనలో రైతులు ఆరాటపడుతున్నారు. అనేక పంచాయతీలలో వరి పంట కోతకు ఒకేసారి రావడం, వరి కోత మిషన్ల కొరత అధికంగా ఉండడంతో రైతుల అవస్థలు వర్ణనతీతంగా ఉంది. వరి కోత మిషన్లు కోసం పలు ప్రాంతాల్లో కాపుకాసుకోని ఎదురుచూస్తున్నారు.

దిగుబడులు బాగానే వస్తున్నాయి

ఇటీవల కురిసి భారీ వర్షాలకు కొంతమేర వరిపంట దెబ్బతిన్న ఎక్కువశాతం పంటచేతికి వస్తుంది. పంటదిగుబడి అధికంగా వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గత ఏడాది మాదిరిగానే మండల కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి వరి దాన్యాన్ని కొనుగోలు చేయాలని, అలాగే మద్దతు ధరతోపాటు క్వింటాకు 500 బోనసు చెల్లించాలని రైతులు కోరుతున్నారు. పోయిన సంవత్సరం కొంత మంది రైతులకు సంబంధించి సన్నరకాల వరి దాన్యానికి బోనసు చెల్లించలేదని, రావాల్సిన బోనసు చెల్లించాలని కోరుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన స్కూల్ బస్సు

బోనకల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో గురువారం ప్రైవేటు బస్సు రోడ్డు పక్కన ఆపి ఉన్న ఆటోను ఢీ కొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఎక్కించుకొనేందుకు చొప్పకట్లపాలెం వచ్చింది. తిరిగి వెళ్లే క్రమంలో మూల మలుపు వద్ద ఒక్కసారిగా స్టిరింగ్ లాకై.. రోడ్డు పక్కన ఆగిఉన్న సామన్లు విక్రయించే ఆటోను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ నల్లపు నరసింహారావుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిది ఏపీలోని నందిగామ మండలం రామిరెడ్డిపల్లి అని తెలిసింది. 108లో అతడిని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో అక్కడకు చేరుకున్నారు. తమ పిల్లలు క్షేమంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏరియా ఆసుపత్రికి నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలి

» సీపీఎం నాయకుల ధర్నా

వైరా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ఏరియా ఆసుపత్రిలో అవసరమైన నిధులు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ఆరోపించారు. వందపడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా సరైన వైద్యం అందడం లేదని, డాక్టర్లు ఉన్నప్పటికీ వసతులు, పరికరాలు, మందులు అందుబాటులో లేవని అవసరమైన నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. వైరా ఏరియా ఆసుపత్రిలోని సమస్యలపై గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ బాలు అలాగే డాక్టర్లు వెంకటేశ్వర్లు, ఆశాజ్యోతి, మాధురి, విజయ్‌కుమార్ రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, మచ్చా మణి పాల్గొన్నారు.

నేడు యర్రగుంటపాడులో అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజకు వేసిన సెట్టింగ్



నాగులవంచ శ్రీనివాసరావు

వేంసూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపాడు గ్రామంలో అయ్యప్పల మహాపడిపూజా కార్యక్రమం వైభవంగా జరగనుంది. గ్రామానికి చెందిన అరబిందో ఫార్మా కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ నాగులవంచ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు జరిగే ఈ పడి పూజకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మేలు తండ్రి బ్రహ్మశ్రీ చంద్రమౌళి వెంకటేష్‌శర్మ ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

17న వైరాలో కోటి దీపోత్సవం

వైరా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో కోటి కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమ్మజన సేవసమితి అధ్యక్ష, కార్యదర్శులు కట్టా కృష్ణార్జున్‌రావు, చింతనిప్పు రాంబాబు, ఏనుగు హన్మంతరావు తెలిపారు. సోమవారం సాయంత్రం 6.30గంటలకు కార్తీక దామోదర ప్రీతీగ కోటి దిపోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దామోదర అనుగ్రహం పొందాలని సూచించారు.

తొలగింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

బోనకల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏ ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించు కోవాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలో పాఠ్య పుస్తకాలు మోసుకొస్తున్న ఆటో బోల్తా పడి విద్యార్థులు గాయపడిన ఘటనలో సమగ్రశిక్ష ఉద్యోగులను తొలగించే ఉత్తర్వులు జారీ చేయడం దారుణమన్నారు. మానవతా దృక్పథంతో ఆలోచించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షుడు జి. మల్లికార్జున్, కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

నీలాద్రీశ్వరుడిని దర్శించుకున్న చాగంటి

పెనుబల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన నీలాద్రీ కొండపై ఉన్న నీలాద్రీశ్వరుడిని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సతీమేతంగా గురువారం దర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి రజనీకుమారి, చైర్మన్ చీకటి చిన్న నర్సింహారావు, కమిటీ సభ్యులు మిట్టపల్లి నరేంద్ర, గంగిశెట్టి జగదీష్, మాణికల ప్రసాద్, మామిళ్ల సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బందితో కలిసి చాగంటి కోటేశ్వరరావు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చాగంటి దంపతులకు పట్టువస్త్రాలను బహూకరించారు. ఆ తర్వాత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యార్థులకు టీ షర్ట్స్, ఐడీ కార్డుల పంపిణీ

కారేపల్లి నవంబరు 13 (ఆంధజ్యోతి): మండల గాదెపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంఈవో దుగ్గిరాల జయరాజు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ శారద చేతుల మీదుగా విద్యార్థులకు టీషర్ట్, ప్యాంట్లు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం మలేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు బానోత్ మంగీలాల్, మను, తృప్తేష్‌షా, జయసుధల సహకారంతో విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాళోజీకి నివాళులర్పించిన కమల్‌రాజ్



కాళోజి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమల్‌రాజ్

మధిర రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహాకవి కాళోజి నారాయణరావు వర్ధంతి వేడుకలను గురువారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. కాళోజి చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్మన్, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ.. కాళోజి జయంతిని రాష్ట్ర బాషా దినోత్సవంగా ప్రకటించి కాళోజిని గౌరవించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ, మండల కార్యదర్శులు అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ వైవీ.అప్పారావు, నాయకులు ముత్తవరపు ప్యారీ, ఇక్బాల్, ఆళ్ల నాగరాజు, బొగ్గుల వీరారెడ్డి, గంగవరపు రామకృష్ణ, కపిలవాయి జగన్, వేల్పుల శివ, రమేష్, చీదిరాల రాంబాబు, అక్బర్, ఆవుల గోపి పాల్గొన్నారు.

డిసెంబరులో పీడీఎస్‌యూ రాష్ట్ర 23వ మహాసభలు



సత్తుపల్లిలో మాట్లాడుతున్న వెంకటేష్

సత్తుపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 5,6,7తేదీలలో జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో కల్లూరు డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హక్కుల సాధనకు, శాస్త్రీయ విద్యావ్యవస్థ పరిరక్షణకు, సమాన విద్యకోసం ప్రతి విద్యార్థి, యువకులు సంఘటితం కావాలని కోరారు. సమాజ మార్పుకు విద్య ప్రధాన ఆయుధమని, పాలకుల నిర్లక్ష్యంతో విద్యావ్యవస్థ క్రమంగా పతనమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం బీఆర్ఎస్ పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆశించగా అవి నెరవేరలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో విద్యారంగం మరింత దీనస్థితికి చేరుకుందని ఆరోపించారు. జిల్లావ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ పేదల రక్తాన్ని డొనేషన్ల రూపంలో పీల్చుకు తింటున్నాయన్నారు.శశికిరణ్, షిలార్‌పాషా, నవీన్, ఈశ్వర్, నిఖిల్, రియాజ్ పాల్గొన్నారు.

108వాహనంలో మహిళ ప్రసవం



మధిర రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం జిలుగుమాడు గ్రామానికి చెందిన నాగలక్ష్మీకి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. నాగలక్ష్మీని 108వాహనంలో ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా సిరిపురం వద్ద నాగలక్ష్మీకి పురిటి నొప్పులు ఎక్కువ కాగ 108సిబ్బంది చెరుకుపల్లి భాస్కర్, పైలెట్ కనకపూడి రాజేష్ ఆమెకు 108వాహనంలోనే ప్రసవం చేశారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. 108 సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



స్నానాల లక్ష్మీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మట్టూరి వెంకటేశ్వరరావు

వైరా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురం, విప్పలమడక గ్రామాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆత్మకమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ ప్రారంభించారు. ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, స్నానాల లక్ష్మీపురం మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ అమ్మిక రామారావు, మల్లు రామకృష్ణ, కోడూరు సత్యం, పొట్లపల్లి నాగేశ్వరరావు, సూరపనేని నాగేశ్వరరావు, మాదా సుబ్బయ్య, విప్పలమడక మాజీ సర్పంచ్‌లు తుమ్మల జాన్‌పాపయ్య, కొలికొండ వీరభద్రం, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు, ఏఈవోలు ఎం.రాజేష్, వెంపటి కీర్తి, డీసీఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.

సీసీఐ నిబంధనలతో నష్టపోతున్న రైతులు



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన రైతు సంఘం నాయకులు

తల్లాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు విషయంలో సీసీఐ నిబంధనలతో ప్రభుత్వ మద్దతు ధర పొందలేక రైతులు నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు అన్నారు. గురువారం తల్లాడలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లాడలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 20 రోజులైనా కేవలం 1500క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ కొనుగోలు కేంద్రం పరిధిలోని 6నుంచి 8 మండలాలకు చెందిన రైతులు పత్తి తీసుకువస్తున్నారని, నిబంధనల పేరుతో పత్తిని కొనుగోలు చేయక పోవడంతో గత్యంతరం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులకు క్వింటా నాలుగైదు వేల రూపాయలకు అమ్ముకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఎకరానికి 12క్వింటాళ్ల చొప్పున పత్తిని కొనుగోలు చేయాలని, తేమ శాతం సడలించి పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికవర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటను నాణ్యతప్రమాణాలు సడలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వరంగల్‌లోని సీసీఐ ప్రాంతీయ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు నల్లమోతు మోహన్‌రావు, నాయకుల అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, గుంటుపల్లి వెంకటయ్య, చల్లా నాగేశ్వరరావు, పెరసాని వెంకటయ్య, కుప్పాల నాగేశ్వరరావు, దగ్గుల నారాయణరెడ్డి, బెల్లంకొండ వీరసైదులు, దుగ్గిదేవర మురళీకృష్ణ, మూలగుండ్ల నాగేశ్వరరావు, వేల్పుల కృష్ణ పాల్గొన్నారు.